# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 02-09-2025 | సంపుటి - 24 | సంచిక - 114 రూ : 4 | పేజీలు: 8




## సీబీఐ విచారణపై ఎలా ముందుకెళ్లాం?



- కేసీఆర్‌తో కేటీఆర్ సహా భారత రాష్ట్ర సమితి నేతల భేటీ
- కవిత వ్యాఖ్యలపైనా చర్చ!

2లో



# తక్షణ సాయం రూ.10 కోట్లు

2లో

- తీవ్ర నష్టం వాటిల్లిన జిల్లాలకు వెంటనే ఇస్తాం
- సమగ్ర వివరాలతో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలి
- వరద సహాయక చర్యల్లో వేగం పెంచండి
- కేంద్ర సాయం కోరేందుకు ఢిల్లీకి ఉప ముఖ్యమంత్రి బృందం
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్
- ఎస్డీఆర్ఎఫ్ నిధులను ఖర్చు చేయకపోవడంపై ఆగ్రహం

## హరీశ్, సంతోష్‌ల అవినీతి వల్లే కేసీఆర్‌కు మరక

- వారి వెనుక ఉండి కుట్రలు చేస్తున్నది సీఎం రేవంత్‌రెడ్డి
- భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆరోపణలు
- కేసీఆర్‌కు తెలంగాణ ధ్యాసే తప్ప.. తిండి, డబ్బు ధ్యాస ఉండదని వెల్లడి



2లో

## పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాల్సిందే

- ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి డిమాండ్
- అధిక సంఖ్యలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు



2లో

హైదరాబాద్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ని రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో సోమవారం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కదం తొక్కారు. పెన్షన్ విద్రోహ దినంగా భావిస్తూ నల్ల దుస్తులు ధరించి ఆందోళనలో పాల్గొన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నేతృత్వంలో ఇందిరాపార్కు వద్ద పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులతో మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ ఉద్యోగుల ఐకాస (టీజీఈజాక్) ఆధ్వర్యంలో ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు నేతృత్వంలో పాత పెన్షన్ సాధన పోరాట సభ నిర్వహించారు. టీజీఈజాక్ ఆధ్వర్యంలో లచ్చిరెడ్డి తరువాయి 2లో



2లో

## దమ్ముంటే అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం

: వైసీపీకి చంద్రబాబు ఓపెన్ ఛాలెంజ్

- రాజంపేట పర్యటనలో సీఎం చంద్రబాబు పెన్షన్ల పంపిణీ
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని వైసీపీకి సవాల్
- బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామాలపై చర్చకు తాను సిద్ధమన్న సీఎం
- అప్పులతో సంక్షేమం చేస్తే చిప్పే మిగులుతుందని పాత ప్రభుత్వంపై విమర్శ
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపిస్తానని హామీ
- గత సర్కారులో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని ఆరోపణ



2లో

## మోదీ-పుతిన్ దోస్తీ...

చైనా సోషల్ మీడియాలో ఇదే టాప్ ట్రెండింగ్

## ఎస్ సీవో లో మోదీ కీలక భేటీ..

భారత్ పై అక్కసు వెళ్లగక్కిన ట్రంప్





2లో

## చెరువుల పునరుద్ధరణ వేగంగా జరగాలి

# తక్షణ సాయం రూ.10 కోట్లు

హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన జిల్లాల కలెక్టర్లకు తక్షణ ఉపశమనం కింద రూ.10 కోట్లు, సాధారణ నష్టం చోటుచేసుకున్న జిల్లాల కలెక్టర్లకు రూ.5 కోట్ల చొప్పున విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ముున్ముందు అకాల వర్షాలు, వరదలు తరచూ సంభవించే ప్రమాదముందని... అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండటంతోపాటు విపత్తుల సమయంలో తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో భారీ వర్షాలు, వరదలతో చోటుచేసుకున్న నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, పరిహారాలను వెంటనే విడుదల చేయాలని సూచించారు. కేంద్రం నుంచి పరిహారం అందకపోవడంపై ఆరా రాష్ట్రంలో గతేడాది సంభవించిన వరదలతో కలిగిన నష్టాలకు సంబంధించి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై సీఎం ఆరా తీశారు. గతేడాదితోపాటు ప్రస్తుతం వివిధ శాఖల పరిధిలో వాటిల్లిన నష్టాలపై వేర్వేరు నివేదికలను 2 రోజుల్లోగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ రెండు నివేదికలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఈ నెల 4న ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులకు అందజేస్తుందని తెలిపారు. ఎస్డీఆర్ఎఫ్ నిధులను నిబంధనల ప్రకారం ఖర్చు చేయడంలో అధికారులు అలసత్వం చూపడంపై సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్ని శాఖలు ఈ నిధులను సక్రమంగా వినియోగించాలని, సకాలంలో వినియోగ పత్రాల(యూసీ)ని సమర్పించాలని స్పష్టంచేశారు.

**నీటి వినియోగదారుల సంఘాలపై...**

వరదలతో రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులు, కుంటలకు గండ్లు పడ్డాయని అధికారులు వెల్లడించా... ''చిన్న నీటిపారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్, ప్రధానమంత్రి కృషి సించాయి యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకుని వాటి పునరుద్ధరణ చేపట్టాలి. గతంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా నీటి వినియోగదారుల సంఘాలుండేవి. వాటికి



సంబంధించిన నిబంధనలు పరిశీలించాలి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలి. దానిపై మంత్రివర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం'' అని సీఎం పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలపగా... వెంటనే నివేదిక ఇవ్వాలన్నారు. నీట మునిగిన సబ్‌స్టేషన్ల స్థానంలో నూతన కేంద్రాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్‌ను ఆదేశించారు. చెంగిచెర్ల, జియాగూడ, అంబర్‌పేటలలోని జంతు వధశాలల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని, మాంసం విక్రేతలు నిబంధనలు పాటించేలా అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలని స్పష్టంచేశారు. పురపాలక, పంచాయతీరాజ్, జీహెచ్ఎంసీ పరిధిలోని వీధి దీపాల నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించి పరిష్కారాలతో రావాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. కొత్త వైద్య, నర్సింగ్ కళాశాలలు, ఆస్పత్రుల భవనాల పనుల్లో వేగం పెంచాలని, వాటి ప్రారంభానికి తేదీలు నిర్ణయించాలని ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినాకు ఆదేశాలిచ్చారు.

**ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి మెరుగైన శిక్షణ**

ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఇటీవలి వరదల సమయంలో 42 ఆపరేషన్లలో 217 మందిని రక్షించడంపై సీఎం సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సిబ్బందికి మరింత మెరుగైన శిక్షణ, నైపుణ్యాలు అందేలా చూడాలని రాష్ట్ర అగ్నిమాపక, విపత్తు స్పందన, పౌర సహాయక విభాగం డీజీ నాగిరెడ్డికి సూచించారు. సమీక్షలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీబీఐ విచారణపై ఎలా ముందుకెళ్దాం?

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను కోరుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఎర్రవెల్లి నివాసంలో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా నేతలు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ తదితరులు సమావేశమయ్యారు. సీబీఐ విచారణను ఎదుర్కోవడంలో ఎలా ముందుకెళ్లాలనే అంశంపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. మంగళవారం హైకోర్టులో దీనిపై విచారణ జరగనుండడంతో... ఈ అంశంపై న్యాయ నిపుణులతోనూ చర్చించినట్లు సమాచారం. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్‌లపై కల్వకుంట్ల కవిత చేసిన తీవ్ర అవినీతి ఆరోపణలపైనా కేసీఆర్ వద్ద చర్చకొచ్చినట్లు తెలిసింది. కవిత వ్యాఖ్యలపై రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు, పార్టీ జిల్లాల అధ్యక్షుల నుంచే కాకుండా... సామాజిక మాధ్యమాల్లో కార్యకర్తల నుంచి కూడా అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పరోక్ష విమర్శలు చేసిన కవిత సోమవారం నేరుగా హరీశ్‌రావుపైనే అవినీతి ఆరోపణలు చేయడంపై సీరియస్‌గానే చర్చించినట్లు తెలిసింది. దీనిపై ఎక్కువ రోజులు ఉపేక్షించకుండా సాధ్యమైనంత త్వరగా కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో హరీశ్‌రావును పొగుడుతూ కేటీఆర్ సోమవారం రాత్రి 'ఎక్స్'లో పోస్ట్ పెట్టడంపై ఆసక్తి నెలకొంది. ''శాసనసభలో కాళేశ్వరంపై మన డైనమిక్ లీడర్ హరీశ్‌రావు... కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు నీటిపారుదల శాఖపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ఆయన సమర్థంగా చేసిన ప్రసంగం నుంచి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కాళేశ్వరంపై పాఠాలు నేర్చుకునే ఉంటారని నేను కచ్చితంగా భావిస్తున్నా'' అని కేటీఆర్ పేర్కొన్నారు. మరోవైపు భారత రాష్ట్ర సమితి సామాజిక మాధ్యమాల్లోనూ హరీశ్‌రావుకు అనుకూలంగా... ''ఇది ఆరడుగుల బుల్లెట్టు... సింహం సింగిల్‌గానే వస్తుంది... కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని అసెంబ్లీ సాక్షిగా ఆధారాలతో సహా హరీశ్‌రావు తిప్పికొట్టారు'' అంటూ పోస్టులు పెట్టారు.

## హరీశ్, సంతోష్‌ల అవినీతి వల్లే కేసీఆర్‌కు మరక

హైదరాబాద్ బంజారాహిల్స్: కేసీఆర్‌కు మరక అంటించడంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ల అవినీతే ప్రధాన కారణమని.. ఇందులో ముఖ్యపాత్ర హరీశ్‌రావుదేనని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వీరిద్దరి వెనుక ఉండి కుట్రలు చేస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. కేసీఆర్‌పై అభాండాలు వేయడం.. కాళేశ్వరం బూచి చూపి సీబీఐ విచారణకు ప్రయత్నించడం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న కవిత విలేకరుల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అమెరికా పర్యటన అనంతరం.. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలున్నాయని పరోక్ష విమర్శలు చేసిన కవిత.. ఇప్పుడు నేరుగా హరీశ్‌రావు, సంతోష్‌లపై విరుచుకుపడ్డారు. ''కేసీఆర్‌కు మరక ఎలా అంటిందో గులాబీ శ్రేణులు ఆలోచించాలి? పక్కన ఉన్న వాళ్ల వల్లే ఆయనకు ఈ దుస్థితి వచ్చింది. అందువల్లే తెలంగాణ అంటే గిట్టని, పక్క రాష్ట్రం ఎజెండాను అమలుచేసే సీఎం రేవంత్‌రెడ్డి సైతం కేసీఆర్‌ను విమర్శించే పరిస్థితి వచ్చింది. అవినీతికి పాల్పడిన హరీశ్, సంతోష్‌లు దగ్గరుండి మరీ కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారు. ఇందులో మేఘా కృష్ణారెడ్డి పాత్ర కూడా ఉంది. అవినీతి ఆరోపణలు ఉండడం వల్లే హరీశ్‌రావును రెండోసారి మంత్రివర్గంలోకి తీసుకోవడంలో జాప్యం చేశారు. అందుకే రెండోసారి నీటిపారుదల శాఖ కూడా ఇవ్వలేదు. నాపై వారిద్దరూ ఎన్ని కుట్రలు చేసినా భరించాను. కేసీఆర్‌పై ఈ వయసులో సీబీఐ విచారణ ఏంటి? ఆయన ఏనాడూ ఆస్తులు సంపాదించలేదు. నా వివాహం చేసేందుకు సైతం ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ అంటే బాధ కలుగుతోంది. కేసీఆర్‌ను నిజాం.. నిజాం అంటున్నారు. అవును.. ఆనాడు నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీటినే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. అలాగే కాళేశ్వరం కూడా చరిత్రలో నిలిచిపోతుంది. కేసీఆర్‌కు తెలంగాణ ధ్యాస తప్ప.. తిండి, డబ్బు ధ్యాస ఉండదు. అటువంటి నేతపై అభాండాలు వేయడం దారుణం. నా వెనుక కాంగ్రెస్ ఉందని.. భాజపా ఉందని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. నాది కేసీఆర్ రక్తం. నేను ఇండిపెండెంట్‌గానే ఉంటాను. కేసీఆర్ వంటి గొప్పనేతపై సీబీఐ విచారణ పరిస్థితి వచ్చాక.. పార్టీ ఉంటే ఎంత? లేకపోతే ఎంత? పెద్దసార్ జోలికి వచ్చాక.. ఎవరినీ వదిలిపెట్టను. నాపై సోషల్ మీడియాలో ట్రోల్ చేసే వారినీ వదిలిపెట్టను. సీబీఐ విచారణలో కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు'' అని కవిత విశ్వాసం వ్యక్తంచేశారు. 'కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం కాదు.. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే.. నేను చెప్పిన వాళ్లపై విచారణ చేయాలి. మీకూ.. మీకూ ఒప్పందాలున్నాయి కాబట్టే రక్షిస్తున్నారు'' అని కవిత.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు.

## పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

* **నాయకత్వంలో ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఓపీఎస్‌తోనే న్యాయం**

ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఎన్నికల సమయంలో ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం జరగాలంటే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలన్నారు. అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చగన్‌లాల్ రోజ్ మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసిన రాష్ట్రాలు ఉద్యోగి వాటా, రాష్ట్ర వాటా తిరిగి చెల్లించాలని కేంద్రం చెప్పడం సరికాదన్నారు. ఉద్యోగుల ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావులు మహాధర్నాకు సంఘీభావంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నాయకులు గీత, చిత్తలూరి ప్రసాద్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

* **చర్చలు సఫలం కాకుంటే బస్సు యాత్ర యథాతథం...**

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని, అందుకు కేంద్రం కూడా సహకరించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ ఉద్యోగుల ఐకాస (టీజీఈజాక్) ఆధ్వర్యంలో నిర్వహించిన పాత పెన్షన్ సాధన పోరాట సభలో వారు మాట్లాడారు. ఈహెచ్ఎస్ కార్డులు అమలు చేయాలని, ప్రతినెలా రూ.700 కోట్ల పెండింగ్ బిల్లుల బకాయిలను విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకొని 51% ఫిట్‌మెంట్ అమలు చేయాలన్నారు. మంగళవారం మంత్రివర్గ ఉపసంఘంతో చర్చలు జరగనున్నాయని, అవి సఫలం కాకుంటే ఈ నెల 8 నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బస్సు యాత్ర యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏడాదిలోపు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ సభలో తీర్మానించారు. ఐకాస నాయకులు శ్యాం, స్థితప్రజ్ఞ, సత్యనారాయణ, వంగా రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చావ రవి, కటకం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల పునరుద్ధరణ వేగంగా జరగాలి

* **క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

హైదరాబాద్, సెప్టెంబరు 01 : నగరంలోని చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అధికారులను ఆదేశించారు. మొదట విడత చేపట్లిన 6 చెరువుల పునరుద్ధరణ త్వరగా పూర్తి కావాలన్నారు. ఈ క్రమంలో ఇటీవల అంబర్పేటలోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమృక్నుద్దౌలా చెరువులను సందర్శించిన హైడ్రా కమిషనర్ సోమవారం సున్నం చెరువును పరిశీలించారు. అలాగే నార్సింగ్ వద్ద సీఎస్ ఆర్ (సామాజిక బాధ్యత) లో భాగంగా తత్వ రియల్ ఎస్టేట్ సంస్థ చేపట్టిన ముప్కి చెరువును కూడా సందర్శించారు. సున్నం చెరువులో డెబ్రీస్ను తొలగించే పనులను పర్యవేక్షించారు. చెరువులోకి వరద నీరు నేరుగా చేరేందుకు వీలుగా వెంటనే ఇన్లెట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువు పై భాగంలోని ప్రాంతాల్లో వరద సాఫీగా కిందకు సాగడంలేదనే ఫిర్యాదుల నేపథ్యంలో చెరువు ఇన్లెట్ల పనుల ఆవశ్యకతను వివరించారు. అలాగే మురుగు కాలువ డైవర్షన్ పనులు కూడా పూర్తి కావాలన్నారు. ఈ వర్షాకాలంలోనే చెరువుల పునరుద్ధరణ జరగాలని సూచించారు.

## మోదీ-పుతిన్ దోస్తీ...
### చైనా సోషల్ మీడియాలో ఇదే టాప్ ట్రెండింగ్

**రష్యా, సెప్టెంబరు 01:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు కంటే భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య ఉన్న స్నేహబంధమే చైనాలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సోమవారం చైనాలోని ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీరిద్దరి సాన్నిహిత్యానికి సంబంధించిన అంశాలే టాప్ ట్రెండింగ్‌లో నిలవడం విశేషం. చైనాలో అతిపెద్ద సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'వీబో'లో సోమవారం ఉదయం "పుతిన్ కారులో మోదీ ప్రయాణం" అనే అంశం నంబర్ వన్ ట్రెండింగ్‌గా నిలిచింది. అదేవిధంగా, దేశంలోని ప్రముఖ సెర్చ్ ఇంజిన్ 'బైదు'లో "మోదీపుతిన్ ఆలింగనం చేసుకుని, చేతిలో చేయి వేసి మాట్లాడుకున్నారు" అనే అంశం కోసం నెటిజన్లు ఎక్కువగా వెతికారు. ఎస్‌సీఓ సదస్సు ప్రాంగణం నుంచి ద్వైపాక్షిక సమావేశ వేదిక వద్దకు వెళ్లేందుకు ప్రధాని మోదీ కోసం పుతిన్ దాదాపు 10 నిమిషాల పాటు వేచి చూశారని, ఆ తర్వాత ఇద్దరూ ఒకే కారులో కలిసి ప్రయాణించారని వార్తలు వెలువడటంతో ఈ ట్రెండ్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఉన్న "ప్రత్యేక స్నేహానికి" నిదర్శనమని చైనా సోషల్ మీడియా యూజర్లు అభిప్రాయపడుతున్నారు. ఎక్స్ (గతంలో ట్విట్టర్) తరహాలో పనిచేసే వీబో, చైనాలో అత్యంత ప్రజాదరణ పొందిన సెర్చ్ ఇంజిన్ బైదులలో మోదీపుతిన్‌ల బంధంపై ప్రజలు విపరీతమైన ఆసక్తి చూపారు. ఇదిలా ఉండగా, టియాంజిన్‌లో జరిగిన 25వ ఎస్‌సీఓ దేశాధినేతల మండలి సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, తన రెండు రోజుల పర్యటనను ముగించుకున్నారు.

## దమ్ముంటే అసెంబ్లీకి రండి... తేల్చుకుందాం

**అమరావతి, సెప్టెంబరు 01 :** ఎన్నికల ముందు 'సిద్ధం సిద్ధం' అని నినాదాలు చేసిన వారికి నేను సూటిగా సవాల్ విసురుతున్నాను. దమ్ముంటే అసెంబ్లీకి రండి.. ఎవరిది విధ్వంసమో, ఎవరిది అభివృద్ధో తేల్చుకుందాం" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి బహిరంగ సవాల్ విసిరారు. రాజంపేట నియోజకవర్గంలోని బోయనపల్లిలో సోమవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగిస్తూ, గత ఐదేళ్ల పాలనపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నేతలు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ సవాల్ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధమని చంద్రబాబు స్పష్టం చేశారు. "బాబాయ్ హత్యపై చర్చిద్దాం రండి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల గురించి మాట్లాడుకుందాం. దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనపై సమాధానం చెప్పాలి. కోడికత్తి డ్రామా, గులక రాయి డ్రామాలపై కూడా చర్చకు నేను సిద్ధం. వైసీపీ అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నాను, మరి చర్చించడానికి వైసీపీ సిద్ధమా?" అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో నిలదీశారు. తనపై క్లైమోర్ మైన్లతో దాడి చేసినా చలించలేదని, తాను డ్రామాలు ఆడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు.

**పెన్షన్ల పంపిణీలో అక్రమాలపై విమర్శలు**

అంతకుముందు, ముఖ్యమంత్రి నేరుగా బోయనపల్లి గ్రామంలోని యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెన్షన్ అనేది పేదలకు ఇచ్చే దానం కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. "తెలుగు వారికి పెన్షన్లను పరిచయం చేసింది ఎన్టీఆర్. ఆయన రూ. 30తో ప్రారంభిస్తే, మేం ఇప్పుడు రూ. 4000 ఇస్తున్నాం. దివ్యాంగులకు 12 రెట్లు పెంచింది టీడీపీ ప్రభుత్వమే" అని గుర్తుచేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం అవయవాలన్నీ సక్రమంగా ఉన్న తమ పార్టీ కార్యకర్తలకు కూడా దివ్యాంగుల పెన్షన్ ఇచ్చిందని, ఇలాంటి అనర్హులను ప్రజలే నిలదీయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకే ప్రభుత్వ సంపద అందాలని ఆయన అభిప్రాయపడ్డారు.

**సంపద సృష్టితోనే సంక్షేమం**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "అప్పు చేసి పప్పు కూడు తింటే చివరికి చిప్పే మిగులుతుంది. అప్పులు చేసి బాగుపడ్డ వారు ఎవరూ లేరు" అంటూ గత ప్రభుత్వ ఆర్థిక విధానాలను చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఆదాయాన్ని పెంచి, ఆ సంపదను పేదలకు సంక్షేమం రూపంలో అందించడమే తన విధానమని పునరుద్ఘాటించారు. "నేను ఐటీ, హైటెక్ సిటీ అంటే ఎగతాళి చేశారు. కానీ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు ఉన్నతస్థాయిలో ఉన్నారంటే అందుకు ఐటీనే కారణం. డ్వాక్రా సంఘాలు పెట్టి మహిళలను ఆర్థికంగా నిలబెట్టాం. మేం చేసిన మంచిని ప్రజలు గుర్తుంచుకోవాలి" అని ఆయన కోరారు.

**రాయలసీమకు రత్నాల హారం**

రాయలసీమ అభివృద్ధికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. "రాయలసీమను రతనాల సీమగా మార్చడమే నా లక్ష్యం. సీమకు నీళ్లిచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన స్ఫూర్తితో రాయలసీమలో కరవును శాశ్వతంగా దూరం చేస్తాం.

## యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్న

మరిపెడ, నెహ్రూ సెంటర్ (మహబూబాబాద్), కోటపల్లి, గూడూరు: మహబూబాబాద్ జిల్లాలో యూరియా కోసం రైతులు చేస్తున్న ఆందోళనలు సోమవారం కొనసాగాయి. జిల్లా కేంద్రం సహా కే సముద్రం, మరిపెడ, డోర్నకల్ తదితర ప్రాంతాల్లో నిరసన వ్యక్తమైంది. సోమవారం అధిక సంఖ్యలో రైతులు మరిపెడకు చేరుకున్నారు. ఉదయం 9.30 గంటల వరకు లోడ్ రాకపోవడంతో జాతీయ రహదారి 365పై ఐదు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. స్థానిక అధికారులు జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి మంగళవారం 2 వేల బస్తాల యూరియా తరలించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు నిరసన విరమించారు. మరోవైపు మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంతో పాటు జనగామ గ్రామంలో అధికారులు యూరియా పంపిణీ చేపట్టగా రైతులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బారులు తీరారు. చెన్నూరులోనూ యూరియా ఇవ్వడం లేదని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు...

* **యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్**
* **కన్సాన్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ**

అందోలు, ప్రజాస్ఫూర్తి: అర్హులైన నిరుపేదలకు ఇంది రమ్మ ఇండ్లను ప్రజా ప్రభుత్వం మంజూరు చేస్తుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. సోమవారం అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన ప్రతి కుటుం బానికి అందిస్తామని, అలాగే ఇంటి నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక ను లబ్ధిదారులకు తక్కువ ధరకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతులమీదుగా ఆందోలు మండలంలోని సంగుపేట ఆందోల్ గ్రామ శివారులో సాండ్ బజార్ ను ప్రారంభించిన విషయం తెలిసిందే అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆరు గారెంటీలు పథకాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లక్షలాది మంది నీడలేని పేదలకు ఐదు లక్షల రూపాయల సహాయాన్ని అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జోగిపేట ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి బాలయ్య, మాజీ ఉపసర్పంచ్ మొరబోయిన కృష్ణ, సీనియర్ నాయకులు తెనుగు మహిపాల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరన్న జాను, బేగరి బాల్ రాజ్, కమ్మరి నాగభూషణం, రామన్నగారి నర్సింహులు, గ్రామ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## అంతర్జాతీయ కుంగ్ ఫు అండ్ త్రైక్వాండో 2025 ఛాంపియన్ షిప్ లో

* **శ్రీ చైతన్య విద్యార్థి ఆదిభట్లకు బంగారు పతకం**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : అంతర్జాతీయ కుంగ్ ఫు అండ్ త్రైక్వాండో 2025 ఛాంపియన్ షిప్ లో శ్రీ చైతన్య విద్యార్థి ఆదిభట్ల బంగారు పతకం సాధించారు. ఆగష్టు 24 న యూసఫ్ గూడ లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఓపెన్ టు స్పోర్ట్స్ ఆల్ స్టైల్ కరాటి కుంగ్ ఫు త్రైక్వాండో మార్షల్ ఆర్ట్స్ చాంపియన్షిప్ 2025 బ్రూస్లీస్ జీట్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఇండియా పోటీలలో వివిధ దేశాల నుంచి పాల్గొన్నారు. అందులో భాగంగా తెలంగాణ నుండి శ్రీ చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న ఆదిభట్ల పాల్గొని ప్రథమ బహుమతిగా బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏ జి యం సతీష్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఇలాంటి మరెన్నో విజయాలను సాధించాలని కొనియాడారు. అనంతరం విద్యార్థి అదిభట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు వెంక రెడ్డి ,రవీందర్ రెడ్డి, రవితేజ, కోఆర్డినేటర్స్ పుల్లారావు ,రవి ప్రిన్సిపల్స్ సతీష్, హుస్సేన్ వైస్ ప్రిన్సిపల్ వాహిని డీన్స్ మహిపాల్ రెడ్డి, సాయికుమార్, ఎ ఓ వెంకటేశం, ఇస్మాయిల్, ఇంచార్జిలు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## మారుతి మిత్ర మండలి సభ్యులకు ఘన సన్మానం..



ప్రజాస్ఫూర్తి, కాప్రా: గాంధీ మెమోరియల్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాగణపతి మంటపం వద్ద సోమవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గత రెండు సంవత్సరాలుగా కుషాయిగూడ పోచమ్మ దేవాలయంలో ప్రతి అమావాస్య రోజు మారుతీ మిత్రమండలి సభ్యులు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఎంతోమందికి ఆదర్శప్రాయంగా ఉందని గుర్తించి మిత్రమండలి సభ్యులను మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి దన్ పాల్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మారుతీ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి హనుమంతు, కోశాధికారి బాబు గౌడ్, సభ్యులు కాసుల సురేష్ గౌడ్, ఆంజనేయులు యాదవ్, సంకురి శ్రీనివాస్ గౌడ్, యావపురం విశ్వనాథం, కాసుల శ్రీకాంత్ గౌడ్, ఎస్ పరమేశ్వర్, పంజాల శ్రీనివాస్ గౌడ్, వీ నర్సింగ్ గౌడ్, ఎన్ గోపాల్ రెడ్డి, వికాస్ రెడ్డి, అనిల్ యాదవ్, రాగుల వేణుగోపాల్, సారా వినోద్ కుమార్, గంప కృష్ణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు వేలం పాటలో లక్ష 16 వేలకు దక్కించుకున్న మురహరి రావు దంపతులు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ బిఎంఆర్ రెసిడెన్సి లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద ఆదివారం నిర్వహించిన లడ్డు వేలం పాట పోటాపోటీగా జరిగింది. ఈ లడ్డు వేలం పాటలో పేరం మురహరి రావు దంపతులు రూ. 101116 లు వినాయకుడి లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బిఎంఆర్ రెసిడెన్సి సభ్యులు, మురహరి రావు దంపతులను ఘనంగా సన్మానించి, లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ , మహేందర్, శ్రీనివాస్, నాగరాజు యాదవ్, శ్రీధర్, వాసు, హరి, శ్రీహరి, గోపికృష్ణారెడ్డి, విజయ్, చైతన్య రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సమైక్యతా విలువలను చూపిన ఉపాధ్యాయులు

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తొమ్మిది ఐటీడీఏ ప్రాంతాలకు చెందిన ఆయా యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా కొత్తగూడెం ఆనంద ఖని పాఠశాలలో సమావేశమై తమ సమైక్యతను చాటారు. ప్రస్తుత కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి పూర్వ గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలం ప్రిన్సిపాల్ గా పని చేసిన డాక్టర్ ప్రభుదయాల్ పదవి విరమణ సందర్భంగా నేడు వీరంతా ఒకచోట చేరి ఉపాధ్యాయ వృత్తి మెలకువలను మరోసారి తమ పూర్వ గురువులైన డాక్టర్ ప్రభుదయాల్, ఉమామహేశ్వర రావు, సుధాకర్ ల నుండి మరోసారి తెలుసుకున్నారు. గిరిజన బీఈడీ కళాశాలలో నాడు సుశిక్షితులై నేడు ఆయా ఐటీడీఏ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమ పూర్వ కుటుంబ స్థితి దయనీయంగా ఉండేదని భద్రాచలం బిఇడి కళాశాలలో నాటి సిబ్బంది ప్రభుదయాల్, ఉమామహేశ్వర రావు, సుధాకర్ తదితరుల శిక్షణతో ఉత్తమ ర్యాంకులతో ఆయా డీఎస్సీల్లో ఉత్తీర్ణత సాధించి ఇప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకుని ఉపాధ్యాయ వృత్తిని చక్కగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ గా అన్ని విద్యా విషయాలలో తోడ్పాటును ఇచ్చినందున కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం, పాడేరు, రంపచోడవరం, శ్రీశైలం, ఏటూరునాగారం, ఉట్నూరు, భద్రాచలం ఐటిడిఏ ప్రాంతాలకు చెందిన గిరిజన ఉపాధ్యాయులు వందల సంఖ్యలో చేరి అప్పటి ప్రిన్సిపాల్, కొత్తగూడెం ఎంఈఓ పదవి విరమణ చేసిన సందర్భంగా వారి వారి అనుభవాలను పంచుకుంటూ ఈ స్థితిలో ఉండడానికి గిరిజన బిఇడి కళాశాలలో నాడు పొందిన శిక్షణ ప్రభావమేనని తెలుపుతూ డాక్టర్ ప్రభుదయాల్ ను స్వచ్ఛందంగా, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు తారాసింగ్, మోహన్ రావు, నరేష్, నరసింహారావు, శంకర్, రిచ్చి, లు పర్యవేక్షించారు. కాగా ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనదనీ, భవిష్యత్తు నిర్మాణాన్ని నిర్ణయిస్తుందనీ అందుకే అంకితభావంతో, విలువలతో విధులను నిర్వర్తించాలని డాక్టర్ దయాల్ ఉద్బోధించారు. చిన్నారులు దేవతలతో సమానమంటూ వారి ఉన్నతికై కృషి చేయాలన్నారు.



## కాళేశ్వరంపై ఇచ్చిన నివేదిక పీసి ఘోష్ కమీషన్ కాదు కాంగ్రెస్ పార్టీ కమిషన్

* **బీఆర్ఎస్ నాయకులు**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కాళేశ్వరంపై నివేదిక ఇచ్చిన పీసి ఘోష్ కమీషన్ అది పీసీ ఘోష్ కమిషన్ కాదని కాంగ్రెస్ పార్టీ కమిషన్ మాత్రమేనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి దండగా అనుకున్న వ్యవసాయాన్ని పండుగగా మార్చిన అపర భగీరథుడు, తెలంగాణ రాష్ట్ర సాధకులు కెసిఆర్ పై అవినీతి రంగు పులుముతూ పీసీ ఘోష్ నివేదికపై సి.బి.ఐ కు కేసును అప్పజెప్పడాన్ని నిరసిస్తూ సోమవారం బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ల సూచనల మేరకు కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ బీడు బారిన తెలంగాణ ప్రాంతాన్ని మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ అన్నారు. 125 ఏళ్ల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏళ్లకేళ్ళుగా పూర్తికాని ప్రాజెక్టులతో తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలోనే కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించిన కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు, తెలంగాణకు శ్రీరామరక్షగా ఉన్న బిఆర్ఎస్ పార్టీని బద్నాం చేసేందుకే ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్, అటు కేంద్రంలోని బిజెపి పార్టీలు దొంగ నాటకాలాడుతున్నాయన్నారు. .పిసి గోష్ కమిషన్ నివేదికలో కేవలం కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు చెందిన మంత్రులు, నాయకులు మాట్లాడిన మాటలే ఉంటాయని, ఇదంతా ఒక బోగస్ కమిషన్ మాత్రమేనని అన్నారు.పీసీ ఘోష్ కమిషన్ పేరుతో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తా ఉన్నారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీలకు ప్రజలే బుద్ధిచెబుతారన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళా నాయకురాలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే

ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తండ్రి చంద్రారెడ్డి ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. కుటుంబ పెద్దను కోల్పోయిన సుభాష్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించడానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేకంగా వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి



ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కుటుంబ పెద్దను కోల్పోవడం చాలా పెద్ద లోటు. ఈ కష్ట సమయంలో మేమంతా మీ కుటుంబానికి అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రారెడ్డి మరణం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సుభాష్ నగర్, అయోధ్య నగర్, గార్డెన్ బస్తీలలో వినాయక మండపాల వద్ద సంక్షేమ సంఘం వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ ముఖ్య అతిథిగా హజరై శ్రీ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ ఫేస్ 1 సంక్షేమ సంఘం అధ్యక్షులు బిజిలి కృష్ణ, బిజిలి సాంబయ్య,బాలరాజ్ చంద్రశేఖర్ రెడ్డి, బాలు, ధన్రాజ్, శ్రీనివాస్,అచ్చిబాబు, శరభయ్య కుత్బుల్లాపూర్ గార్డెన్ బస్తి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉప్పల హరి వేణుగోపాల్,సలహాదారులు ఘనబోయిన నర్సింగ్ రావు, ఉప్పల హరి, సభ్యులు సురేష్, రాజేష్, రమేష్, అయోధ్య నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మణ్, మల్లేష్, రమేష్, భాస్కర్ గౌడ్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రులలో శివలింగ దీపాల అలంకరణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గణేష్ నవరాత్రుల సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని రామవరం ఓల్డ్ మార్కెట్ ఏరియా శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం సమీపంలో ప్రత్యేక ఆకర్షణ ఏర్పాటైంది. ఆర్సిసి యూత్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి శివలింగ ఆకారంలో వందలాది దీపాలతో అలంకరించి భక్తుల దృష్టిని ఆకర్షించారు.దీపాలతో ముస్తాబైన శివలింగం వెలుగుల్లో ఆలయ ప్రాంగణం కాంతివంతంగా మారగా, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు గణనాథుని ఆశీస్సులతో పాటు భోళేశంకర్ కృప కూడా లభించాలని కోరుకున్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నియోజకవర్గ పరిధిలోని వివిధ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక ప్రజల సమస్యలు, కాలనీల్లో రోడ్ల బీభత్స పరిస్థితి గురించి కూడా ఆయన వివరించారు.నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ ఇచ్చినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మల్కాజ్గిరిలో స్థల కేటాయింపుపై తెలంగాణ బ్రాహ్మణ సంఘం ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు

మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజ్గిరి నియోజకవర్గంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘానికి స్థలాన్ని కేటాయించాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం రాష్ట్ర ఐ.టి., ఇండస్ట్రీస్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబు ని అసెంబ్లీ లో మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బ్రాహ్మణ కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో, వివాహాలు, కర్మకాండలు , ఇతర సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం ఒక సమగ్ర బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం అవసరమని వారు వివరించారు. ఈ స్థల కేటాయింపు ద్వారా పేద బ్రాహ్మణ కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే హితవు చెప్పారు.ఈ విజ్ఞప్తిని మంత్రి సానుకూలంగా స్వీకరించి, తక్షణమే మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కి అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా, తెలంగాణ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సమాజం సంక్షేమం పట్ల ఆయన చూపిన శ్రద్ధకు సంఘం తరపున ప్రశంసలు వెల్లువెత్తాయి.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, కార్యదర్శి మరియు పలువురు సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్ అండ్ ఆర్ కాలనీ నందు వినాయక చవితి మహా అన్నదాన కార్యక్రమం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు పట్టణం ఆర్ అండ్ ఆర్ కాలనీ నందు వినాయక చవితి 12వ వార్డు అన్నదాన కార్యక్రమానికి హాజరైనాము ఈ యొక్క అన్నదాన కార్యక్రమాన్ని తెలంగాణ ఉద్యమ కారులు శిలవేరి సత్యనారాయణ , మాజీ కౌన్సిలర్ సిలువేరి అనితా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ కడగంచి పద్మ, వడ్ల శ్రీనివాస్, ఆ దూరి రవి , 13వ వార్డు కుమార్, వెంకట్, మురళి తదితరులు పాల్గొని శ్రీ బొజ్జ గణపతి ఆశీస్సులు తీసుకున్నారు.

## మహోన్నతమైన వ్యక్తి ఆచార్య ప్రభుదయాల్ ని ఘన సన్మానం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో, తెలంగాణ రాష్ట్రంలో ఏ ఉపాధ్యాయుడికి దక్కని అపూర్వ గౌరవం మా గురువు ప్రభుదయాల్ కి దక్కింది.ఆయన నేర్పిన చదువు పాటవాలతో ప్రయోజకులైన ఏజెన్సీ బిఈడి కాలేజ్ భద్రాచలం శిష్యులందరూ కలిసి అందరినీ ఆశ్చర్య పరుస్తూ అద్భుతమైన ప్రసంగాల మధ్య ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మా గురువు ప్రభు దయాల్ పదవి విరమణ సన్మాన మహోత్సవంలో పాల్గొనడం మా అదృష్టమని ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్,టిజిటిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నారు.మా చిన్ననాటి గురువు అయినా ప్రభుదయాల్ సార్ ఆయన నేర్పిన జీవిత పాఠాలు మాకు ఎంత ఉపయోగపడ్డాయి.ఈ స్థాయిలో అన్ని రంగాలలో వేల మంది శిష్యులు ఉన్నామంటే కేవలం ప్రభుదయాల్ సార్ క్రమశిక్షణతోనే సాధ్యమైందన్ని అన్నారు.నేను రాష్ట్ర స్థాయిలో నాయకత్వం చేస్తున్నానంటే ఆయన నేర్పిన నాయకత్వ మెళుకువలే అని అన్నారు. ఆయన ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ఎంఈఓ గా, ఎంపీడీవో గా ఇంచార్జ్ చేసి పాలనదక్షుడు అయ్యారు.భద్రాచలంఏజెన్సీ బిఈడి కాలేజ్ లో లెక్చరర్ గా,ప్రిన్సిపాల్ గా పని చేసి వేల మంది గిరిజన విద్యార్థుల జీవితాలతో వెలుగు నింపారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆయన చేసిన సేవలను గుర్తించి లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డు ఇవ్వాలని కోరారు.ఆయన ఏ రోజు అవార్డ్ కోసం పరితపించలేదు. మా జీవితంలో లో వెలుగు నింపడమే ఆయనకు వేల అవార్డ్ సమానం ఉంటుంటారు అలాంటి గొప్ప మహోన్నమైన వ్యక్తిత్వం కలిగిన మా గురువు కి లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డుఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం సత్కరించాలని శిష్యుల తరుపున ఇదే మా విజ్ఞప్తి అని అన్నారు. అనంతరం శాలువ తో సత్కరించి,గజ మాల వేసి ఘన సన్మాన చేసిన ప్రియ శిష్యులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, టిజిటిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు,భూక్యా రామకృష్ణ డిఆర్ఓ,బానోత్ శంకర్ టీచర్,నాగార్జున డి ఈ తదితరులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో సోమమ్మ అనే వృద్ధురాలు కి గాయాలు



ప్రజాస్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు పట్టణంలోని సింగరేణి ఆర్ అండ్ ఆర్ కాలనీలో కోతుల దాడిలో సోమమ్మ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. కోతుల వల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లందు మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కాలనీలో కోతుల కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. వృద్ధురాలి కాలిపై దాడిని గమనించిన స్థానికులు కోతులను తరిమికొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



## ఇల్లందు లో బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: అసెంబ్లీలో కాళేశ్వరం చర్చ సందర్భంగా పచ్చి అబద్ధాలు మాట్లాడి, వివరణ ఇవ్వకుండా హరీష్ రావు ని పదే పడే అడ్డుకోవడాన్ని నిరసిస్తూ సోమవారం ఇల్లందు జగదాంబ సెంటర్,తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాలా రాజేందర్, పట్టణ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దిండిగాలా రాజేందర్ మాట్లాడుతూ మాజీ జస్టిస్ పిసి గోష్ కాళేశ్వరం నివేదికపై నిన్న అసెంబ్లీలో చర్చకు ఆహ్వానించడం జరిగింది. కానీ ఆ నివేదికలో పొందుపరిచిన విషయాలు వాస్తవ దూరాలని సమగ్రంగా అనుమతులను ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలించకుండా అది కాంగ్రెస్ పార్టీ నివేదికల తయారుచేసి అసత్యాలను అబద్ధాలను ప్రచారం చేసి తెలంగాణ కరువు ప్రాంతానికి నీరు అందించిన అపర భగీరథుడు కేసీఆర్ ని అప్రతిష్ట పాలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ శతవిధాల ప్రయత్నం చేసిందన్నారు. ఆ నివేదికలోని లోటు పాట్లను ఎత్తిచూపుతున్న హరీష్ రావు ని పదేపదే అడ్డుకుంటూ.. ఎమ్మెల్యేలుగా మంత్రులుగా ఉండి కనీస పరిజ్ఞానం లేని అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేస్తూ సభాకాలాన్ని వృధా చేశారన్నారు. సాక్షాత్తు మంత్రులు ముఖ్యమంత్రి సభలో పచ్చిగా అబద్ధాలు ఆడుతూ నివేదికను మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం విలువ 87 వేల కోట్లు కానీ కాంగ్రెస్ పార్టీ పదేపదే ఈ ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని అనటం వారి గోబెల్స్ ప్రచారానికి పరాకాష్ట అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, టౌన్ నాయకులు యండి.జబ్బార్, నారపాక వసంత్, లలిత్ పాసి, సన రాజేష్, పాలడుగు రాజశేఖర్, సుందరగిరి శ్రీను, గడ్డి శ్రీను, వంగ సునీల్, శ్రీకాంత్, ఇమ్రాన్, ఖమ్మ, రాంలాల్ పాసి, కిషన్ పాసి సర్దార్, రఘువీరారెడ్డి, రవి గౌడ్.. మండల నాయకులు దేరంగుల పోశం, దేవ్లా, చిన్నారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## సెప్టెంబర్ 3 తేదీన ఛలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

*** ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద నాగకృష్ణ, బయ్య అభిమన్యు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సెప్టెంబర్ 3 తేదీన భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు మేధావులు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద నాగకృష్ణ కృష్ణ బయ్య అభిమన్యు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజ్ రియంబర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దగ్గరికి వస్తున్న కనీసం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోవడం విఫలమైందన్నారు అద్దె భవనంలో ఉంటున్న గురుకుల పాఠశాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు పెండింగ్లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయలన్నారు జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఖాళీగా ఉన్న డీఈఓ ఎంఈఓ పోస్ట్ భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల సమస్యలు పరిష్కరించాలని నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సొంత భవనం ప్రారంభించాలని హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు సుమారుగా 6 నెలల నుంచి మెస్ బిల్లు విడుదల చేయక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్రంలోని విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, ఎమ్మెల్యే ఎంపీ మంత్రుల ఇంటిని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రవళి, స్వప్న, మౌనిక, సరిత, స్రవంతి, జాహ్నవి, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు వేలం పాటలో లక్ష 16 వేలకు దక్కించుకున్న మురహరి రావు దంపతులు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీ బిఎంఆర్ రెసిడెన్సి లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపం వద్ద ఆదివారం నిర్వహించిన లడ్డు వేలం పాట పోటాపోటీగా జరిగింది. ఈ లడ్డు వేలం పాటలో పేరం మురహరి రావు దంపతులు రూ. 101116లు వినాయకుడి లడ్డును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బిఎంఆర్ రెసిడెన్సి సభ్యులు, మురహరి రావు దంపతులను ఘనంగా సన్మానించి, లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ , మహేందర్, శ్రీనివాస్, నాగరాజు యాదవ్, శ్రీధర్, వాసు, హరి, శ్రీహరి, గోపికృష్ణారెడ్డి, విజయ్, చైతన్య రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్తమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలి

*** సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్**



కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : అస్తవ్యస్తమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. సోమవారం మెట్రో వాటర్ వర్క్స్ జిఎం మాధవి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ సూరారం డివిజన్ కార్యదర్శి పసుల అంజయ్య లు పాల్గొని మాట్లాడుతూ సూరారం డివిజన్ షాపూర్ నగర్ సంజయ్ గాంధీ నగర్ న్యూ షాపూర్ నగర్ కళావతి నగర్ వివిధ బస్తీలలో పాతిక సంవత్సరాల క్రితం చేసినటువంటి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా తయారై బస్తీలలో రోడ్లమీద మురుగునీరు వరదల ప్రవహిస్తుందన్నారు. పాతిక సంవత్సరాల క్రితం ఉన్న జనాభా ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థ నిర్మించారన్నారు. నాలుగు రెట్లు జనాభా పెరిగి పెద్దపెద్ద అపార్ట్మెంట్లు బిల్డింగులు అయిపోయి భూగర్భ డ్రైనేజీ లైన్లు నిండిపోయి మ్యానువల్స్ నుంచి బయటికి మురుగునీరు వస్తుందన్నారు. గతంలో కూడా సంబంధిత అధికారులకు సిపిఎం పార్టీ నుండి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. అప్పటి వరకే తాత్కాళికంగా డ్రైనేజీ లైన్లు మ్యానువల్స్ క్లీన్ చేసి వెళుతున్నారని మళ్లీ వారం తర్వాత ఉన్నటువంటి సమస్య పునరావృతం అవుతుందని దీనివలన బస్తీ ప్రజలు విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు వెంటనే సూరారం డివిజన్లో ఉన్న అన్ని బస్తీలలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి సమస్యను పరిష్కారం చేయగలరని, లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బస్తీ ప్రజలను సమీకరించి సంబంధిత అధికారుల ఆఫీసులను ముట్టడిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో మధు, సత్యనారాయణ, నాగరాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

## లక్ష ఒక్క రూపాయికి గణనాధుని లడ్డును దక్కించుకున్న 93 బ్లాక్ ప్రెసిడెంట్ జయకుమార్ గుప్త



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కొల్లరు..ఫేస్ ..2, కేసీఆర్ నగర్ లోని 93 బ్లాక్ వినాయకుడి లడ్డు ను ఒక లక్ష ఒక్క రూపాయికి బ్లాక్ ప్రెసిడెంట్ ఎల్లకొండ జయకుమార్ గుప్త దక్కించుకున్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 93..బ్లాక్ లో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేలంపాటలో గణనాధుని లడ్డును ఒక లక్ష ఒక్క రూపాయికి జయకుమార్ దక్కించుకున్నారు. కమిటీ సభ్యులు ఆయనను శాలువతో సన్మానించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం జయకుమార్ మాట్లాడుతూ విఘ్నేశ్వరునికి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని, గణనాధుడి ఆశీర్వాదంతో లడ్డును దక్కించుకోవడం తన అదృష్టమన్నారు. బ్లాక్ లోని ఇంటి యజమానులందరు తమ పూర్తి సహకారాలను అందిస్తున్నారని, వారి సహకారంతో 93..బ్లాక్ ను మరింత అభివృద్ధి చేస్తానని జయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక నేతలు, 93 బ్లాక్ ఇంటి యజమానులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు గుడ్ న్యూస్.. బతుకమ్మ పండుగ షెడ్యూల్ విడుదల

తెలంగాణ ప్రజలు జరుపుకునే పండుగల్లో బతుకమ్మ ప్రత్యేకం. తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఈ బతుకమ్మ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా బతుకమ్మ పండుగ షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబర్ 22 నుంచి తెలంగాణలో బతుకమ్మ వేడుకలు జరుగనున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈనెల 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్, 28న 10 వేల మందితో బతుకమ్మ సంబురాలు, 29న పీపుల్స్ ప్లాజా దగ్గర బతుకమ్మ పోటీలు, ఈనెల 30న బతుకమ్మ పరేడ్ ఉంటుందని జూపల్లి తెలిపారు. ఈసారి ప్రపంచదృష్టిని ఆకర్షించేలా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని ప్రకటించారు.

# డ్రైనేజీ ఆక్రమించి భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలి

* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**
* **విద్యానగర్ ప్రధాన రహదారిని సందర్శించిన సిపిఎం బృందం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: చెరువుని తలపించే విధంగా విద్యానగర్ ప్రధాన రహదారి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు.రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు చెరువుని తలపించే విధంగా మారిన విద్యానగర్ ప్రధాన రహదారిని సిపిఎం బృందం సందర్శించింది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చింతలచెరువు నుండి వస్తున్న వరద, అలాగే వర్షపు నీరు రామవరం గోధుమ వాగులో కలవకుండా డ్రైనేజీలు ఆక్రమించి బిల్డింగులు నిర్మించడం వలన నడిరోడ్డు మీద నీళ్లు ఆగుతున్నాయని ఆయన అన్నారు. దీనివలన ప్రయాణికులు చుట్టుపక్కల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పంచాయతీ అధికారులు పరిశీలన చేయకుండా అనుమతులు ఇవ్వడం వలన డ్రైనేజీలు కూడా ఆక్రమించి బిల్డింగులు నిర్మించారని దీనివలన గోధుమ వాగులో కలవాల్సిన నీరు నడి రోడ్డుపై నిల్వ ఉంటుందని ఆయన తెలియజేశారు. ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడిచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలు కడుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే డ్రైనేజీలను సైతం ఆక్రమించి ఇల్లు కడుతున్నారని దీనివలన స్థానిక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. డ్రైనేజీలు నిండిపోయి రోడ్డుమీద నుండి నీళ్లు ఇళ్లలోకి కూడా చేరడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పంచాయతీ అధికారి స్పందించి డ్రైనేజీలపై నిర్మించిన బిల్డింగ్లను తొలగించాలని డ్రైనేజీలు నిర్మించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ,జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ ,టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్ ,సీనియర్ నాయకులు కె హెచ్ ప్రసాద్, ఎం.ఎస్ ప్రకాష్ టౌన్ కమిటీ సభ్యులు, మంద నాగకృష్ణ, ప్రమోద్ ,సతీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బేషరతుగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

* **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీజేఏసీ బి. రవిప్రకాశ్**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : సీపీఎస్, యూపీఎస్ వద్దు బేషరతుగా పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీజేఏసీ చైర్మన్ బి. రవిప్రకాశ్ అన్నారు. పెన్షన్ విద్రోహ దినంలో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, అంతయపల్లిలో సోమవారం జరిగిన భారీ సమావేశంలో వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ను వ్యతిరేకిస్తూ, ఉద్యోగులు “సీపీఎస్ మాకొద్దు - యూపీఎస్ మాకొద్దు - పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) మాత్రమే కావాలి” అని గర్జించారు. నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల కష్టార్జిత భవిష్యత్ భద్రతను బలిగొట్టే సీపీఎస్ / యుపిఎస్ వంటి విధానాలను మేము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు. 2004కి ముందు ఉద్యోగులకు వర్తించిన పాత పెన్షన్ విధానం ఉద్యోగుల నిజమైన హక్కుఅని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ఇక ఆలస్యం సహించబడదు. ఉద్యోగుల పోరాటం కేవలం మొదలైంది. జంగ్ సైరన్ మోగిందని ఇది ఆగదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ఉద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్క ఉద్యోగిలో ఇంకా రగుల్తూనే ఉందని, ఆ స్ఫూర్తిని ప్రభుత్వం మరచిపోకూడదన్నారు. మళ్లీ అవసరం వచ్చింది కాబట్టి అదే ఉద్యమ స్ఫూర్తితో టీజేఏసీ ఆధ్వర్యంలో సీపీఎస్‌ను రద్దు చేయించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఈజేఏసీ సెక్రటరీ, టీజీఓ అధ్యక్షుడు జి. వినోద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామమోహన్, టీజీఓ కార్యదర్శి కురుముతి,ట్రెసా అధ్యక్షుడు సుధాకర్, టీజీఓ ఉపాధ్యక్షుడు రవీందర్,ఎస్టీమయుటీఎస్ తరపున బి. వెంకటేశ్వర్లు, యు. విట్టల్ , జె. ప్రేమ్‌కుమార్, టీఎస్యుటీఎఫ్ నుండి జయసింహారెడ్డి, మధన్‌రెడ్డి, టీయుటీఎఫ్ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ రాఘవేందర్,టీఎన్జీఓ కార్యదర్శి బి. భారతకుమార్, కోశాధికారి శేష సాయి గిరికాంత్, జాయింట్ సెక్రటరీ అశ్విని, సుధీర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు కార్తిక్, కార్యదర్శి కిషోర్, ఖజాంచి అక్షయ్, లక్ష్మీ ప్రసన్న, చందు, లక్ష్మయ్య, మేడ్చల్ యూనిట్ టీఎన్జీఓ అధ్యక్షుడు శ్రీనివాస్, శామీర్‌పేట్ యూనిట్ టీఎన్జీఓ అధ్యక్షుడు రవి యాదవ్, మల్కాజ్గిరి యూనిట్ కార్యదర్శి అరుణ, కుత్బుల్లాపూర్ యూనిట్ టీఎన్జీఓ అధ్యక్షురాలు నసీమ, ఖజాంచి సత్యజ్యోతి, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ప్రతినిధి మనిక్యం, క్లాస్ IV ఉద్యోగుల తరపున శ్రీనివాస్, మల్లరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పోలయ్య కవికి ఘన సన్మానం



(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : హైదరాబాద్ రవీంద్ర భారతిలో గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు పాల్గొని తమ కవితలను వినిపించారు. కూకట్ పల్లి కి చెందిన పోలయ్య కవి “మౌనంగా రోదిస్తున్న నా మాతృభాష” అను శీర్షికతో... తన కవితను వినిపించి అందరి ప్రసంశాలు పొందారు. సభాధ్యక్షులు కళారత్న డాక్టర్ బిక్కీకృష్ణ, సంస్థ వ్యవస్థాపకులు కాంతికృష్ణ, శంకరం వేదిక వ్యవస్థాపకులు యలవర్తి అనురాధలు ప్రముఖ కవి పోలయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సభకు ముఖ్య, విశిష్ట, ఆత్మీయ, అతిథులుగా తెలుగుదేశం పోలిట్ బ్యూరో మెంబర్, మాజీ ఎమ్మెల్సీ టి.డి జనార్ధన్, మైన్స్ డైరెక్టర్, మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవాధ్యక్షులు డాక్టర్ వి. డి రాజగోపాల్, విమల సాహితీ వ్యవస్థాపకులు డా.జల్దీ విద్యాధర్ లు హాజరై గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకోసం చేసిన పోరాటాలను, కృషిని కొనియాడారు. కార్యక్రమంలో యాంకర్ పద్మశ్రీ లత కవి సమ్మేళనం సమన్వయ కర్త డా.రాధా కుసుమ పాల్గొన్నారు.తదనంతరం వివిధ రంగాలలో విశేషమైన కృషిచేసిన కళాకారులను కవితాగానం చేసిన కవులందరినీ ఘనంగా సన్మానించారు.



### కొమరం భీం కాలనీ ప్రజలకు

# పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

* **సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిన్న రాత్రి కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన నెహ్రూబస్తీ మరియు కొమరం భీం కాలనీ ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు డిమాండ్ చేశారు. వర్షంతో నీట మునిగిన ఇళ్లను సిపిఎం బృందం సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించింది. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ, “ఎడతెరిపిలేని వాన వలన డ్రైనేజీ పొంగిపోవడంతో నీళ్లు ఇళ్లలోకి చేరి ప్రజలు రాత్రంతా నిద్రలేక అవస్థలు పడ్డారు. నెహ్రూబస్తీ పక్కన ఉన్న డ్రైనేజీ మధ్యలో రైల్వే ట్రాక్ కింద కిన్నెరసాని పైపులైను ఉండటం వలన చెత్తాచెదారం పేరుకుపోయి నీళ్లు పోటెత్తాయి. ఫలితంగా ఇళ్లలోకి నీళ్లు చేరి వస్తువులు జలమయమయ్యాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి బాధితులకు నష్టపరిహారం అందించాలి” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొమరం భీం కాలనీ పరిస్థితిని ప్రస్తావిస్తూ, “గత ఆరు సంవత్సరాలుగా ప్రజలు గుడిసెలలో నివాసం ఉంటూ ప్రతి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి భారీ వర్షాల వలన ఇళ్లలోకి నీళ్లు చేరి కనీసం కాలు నిలబెట్టుకోడానికి కూడా వీలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వారి గోసను ప్రభుత్వం పట్టించుకుని పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి” అని బాలరాజు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, టౌన్ కమిటీ సభ్యులు నాగకృష్ణ, నాయకులు వై. వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, రజిత, సలీం, రసూల్, బి. బాలకృష్ణ, రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరంపై అబద్ధాలు మాట్లాడి ప్రజలను తప్పదోవ పట్టించడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు

* **మాజీ జడ్పి కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాళేశ్వరంపై అబద్ధాలు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టించడం తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని మాజీ జడ్పి కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహ రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసినన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాజీవ్ విగ్రహం వద్ద రైతులతో కలిసి బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. కాళేశ్వరం మీద బురద చల్లేందుకు, రాజకీయ కక్ష తీర్చుకునేందుకు కాంగ్రెస్ విఫలయత్నం చేసిందన్నారు. తెలంగాణ రైతాంగం యూరియా మహాప్రభో అంటూ వేడుకుంటుంటే దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ కాళేశ్వరంపై ఆరోపణలు చేస్తుందన్నారు. యూరియా కోసం గంటల తరబడి రైతులు క్యూలైన్లలో పడిగాపులు కాస్తున్నారని, దీంతో ప్రభుత్వం తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. యూరియా దొరక్క అన్నదాతలకు వెతలు తప్పడం లేదన్నారు. జిల్లాల్లో రోజురోజుకూ కొరత పెరిగిపోతుండటంతో ఆందోళనలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. దీంతో రైతన్న రోడ్డెక్కి నిరసన తెలుపుతూ ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీస్తున్నారని అన్నారు. 20 రోజులైనా సరిపడా యూరియా తెప్పించడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు నిలదీస్తున్నారని అన్నారు. తమ వద్దకు వచ్చిన ప్రతిపక్ష పార్టీల నేతలకు గోడు చెప్పుకొని కన్నీటి పర్యంతమవుతున్నారని అన్నారు. నమ్మి ఓటేస్తే నట్టేట ముంచారని, ప్రజలు త్వరలోనే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి లతో కలిసి కలెక్టరు (88) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూజలందుకున్న గణనాథుడు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్ లోని కమల ప్రసన్న నగర్ వెల్ఫేర్ అసోషియేషన్ ,రిక్షాపుల్లర్స్ కాలనీ రోడ్ నంబర్ 29 ల లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల దగ్గర స్థానికులతో కలసి డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమములో పాల్గొన్నారు.

## ‘నేను, సీతక్క, క్రాంతి ముగ్గురం మహిళలమే’.. కొండా సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు



ఆడబిడ్డల పోరుగడ్డ.. వరంగల్‌లో టూరిజం శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలునిర్వహించడం హర్షించదగిన విషయం అని మంత్రి కొండా సురేఖ అన్నారు. రాణిరుద్రమ, సమ్మక్క, సారక్క, చాకలి ఐలమ్మ, హజారే మంగమ్మ వంటి ధీనవనితలు పుట్టిన నేల ఓరుగల్లు అని ఆమె పేర్కొన్నారు. అటువంటి వరంగల్ జిల్లాలో బతుకమ్మ వేడుకలను మొదటిసారిగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామం అని అన్నారు. సోమవారం తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, సాంస్కృతిక విభాగం సంచాలకులు మామిడి హరికృష్ణ, బతుకమ్మ పండుగ నిర్వాహకురాలు దిల్లీశ్వరి పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ పోస్టరును విడుదల చేశారు.

# గణనాథునికి ప్రత్యేక పూజలు, అన్నదానం, నిమజ్జనం

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రతి పనిలో విఘ్నాలను తొలగించి.. విజయం సిద్ధించేలా ఆశీర్వదించే స్వామి విఘ్నేశ్వర స్వామి అని చౌటుప్పల్ ఏసీబీ పటోళ్ల మధుసూదన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, చౌటుప్పల్ సిఐ మన్మథ కుమార్, సీనియర్ జర్నలిస్టు దోనూరు రాంరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు బత్తుల విప్లవ్ గౌడ్ లు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రక్కన శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి సోమవారం వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు అన్నదానం కార్యక్రమంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సందగళ్ళ సతీష్ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బడుగు మాణిక్యం, బిఆర్ఎస్ వై మున్సిపల్ అధ్యక్షుడు తొర్పునూరి నరసింహ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకుడు తొర్పునూరి రవి గౌడ్, ది ప్రెస్ క్లబ్ చౌటుప్పల్ అధ్యక్షులు దోనూరు రాంరెడ్డి తదితర పాత్రికేయులు, పట్టణ ప్రజలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



**లడ్డు వేలం, నిమజ్జనం..**
శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ప్రతిష్టించిన వినాయకుడి నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో చెవగోని వెంకటేశం గౌడ్ రూ.10,116లకు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డును వేలం పాటలో తీసుకున్న వెంకటేశం గౌడ్ ను సీనియర్ జర్నలిస్ట్ దోనూరు రాంరెడ్డి శాలువా కప్పి అభినందించారు. అనంతరం వినాయక స్వామిని శోభాయాత్రగా తీసుకువెళ్లి నిమజ్జనం చేయడం జరిగింది.

## ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలి

* **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ , పరిసర ప్రాంతాల్లో తరచూ ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అధికారులను కోరారు.సోమవారం ఎస్.సి.బి. నగర్, విద్యానగర్ తదితర వర్ష ప్రభావిత ప్రాంతాలను సిపిఐ ప్రతినిధి బృందం పర్యటించింది. బాధితులను కలుసుకొని నష్టాన్ని అంచనా వేసి, అధికారుల ద్వారా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూభారీ వర్షాల ప్రభావంతో అంతర్గత రహదారులు, డ్రైన్లు, విద్యుత్ స్తంభాలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.వర్షాలు కొనసాగితే ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టి, ధ్వంసమైన రోడ్లు-డ్రైన్ల పునర్నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఇండ్లు కోల్పోయిన పేదలకు నష్టపరిహారం చెల్లించి, పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు.సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.అతను మాట్లాడుతూ, ముంపు సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్లామని, అత్యవసర నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా,పాతకొత్తగూడెం-పెనుబల్లి బ్రిడ్జి వద్ద పరిస్థితులను పరిశీలించారు. కూనంనేని కృషితో రూ.6.50 కోట్లు సిఆర్ఆర్ నిధులు మంజూరయ్యాయని, అక్టోబరులో పనులు ప్రారంభమై వచ్చే వర్షాకాలానికి పూర్తవుతాయని, దీంతో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పర్యటనలో నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సందెబోయిన శ్రీనివాస్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## వరద, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించండి

* **ఎమ్మెల్యే కూనంనేని ఆదేశాలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గంలో భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే సోమవారం మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్, పంచాయతి రాజ్, రెవెన్యూ, పోలీసు శాఖల జిల్లా, డివిజన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సూచనలు ఇచ్చారు. ఇటీవలి భారీ వర్షాలతో పలు గ్రామాలు, బస్తీల్లో రహదారులు, కల్వర్టులు, వంతెనలు దెబ్బతిన్నాయని, వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించాలన్నారు. విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న చోట్ల కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు.

**ప్రత్యేక దృష్టి పారిశుద్ధ్యంపై**

ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైనచోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

**ఇళ్ళు, పంటల నష్టానికి పరిహారం**

వర్షాల వల్ల ఇళ్ళు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషి చేస్తానని, పంటల నష్టంపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**నిర్వాసితులకు పునరావాసం**

నిర్వాసితులుగా మారిన కుటుంబాలకు తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉపేక్షించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## బై బై..గణేశా...

* **మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జన వేడుకలు**

అందోలు, ప్రజాస్ఫూర్తి: వినాయక చవితి వేడుకలకు కొలువుదీరి భక్తిశ్రద్ధలతో ఆరు రోజులపాటు పూజలందుకున్న గణ నాథులు సోమవారం భక్తుల కేరింతల నడుమ గంగ ఒడి చేరుకున్నారు. అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలోని శివాలయం వద్ద మహాదేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిన్ని గణనాథుడిని ఉత్సవ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా రంగులు చల్లుకుంటూ నిమజ్జనానికి విగ్రహాలను తరలించారు. ఈశ్వరాలయం నుండి ప్రారంభమైన గణనాథుని శోభయాత్ర గ్రామంలోని అన్ని వీధుల గుండా ఆటపాటల మధ్య ముందుకు కొనసాగింది. దారి పొడవునా మహిళా భక్తులు గణనాథునికి మంగళహారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో ఊరేగింపుగా వినాయక ఘాట్‌కు



వెళ్లారు. 'గణపతి బొప్పా మోరియా' అనే నినాదాలు చేశారు.గణనాథుని శోభాయాత్రలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. మహాదేవ్ యూత్ సభ్యులు తాళ్ల మణికంఠ, ఎర్రరాం శంకరన్న, రామన్నగారి మల్లేశం, మన్నె నితీన్ గౌడ్,సంగన్నగారి సత్తి, వని అశోక్, చెట్ల శివకుమార్,మొరబోయిన శివశంకర్, చెట్ల చెన్నయ్య, రామన్నగారి చిన్న మల్లేశం, కాల్వమీది రమేష్, చాకలి నాగరాజు, చెట్ల శివతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## లండన్ లో ఘనంగా గణేష్ ఉత్సవాలు



లడ్డూ వేలం పాటలో 3 లక్షల 60,000 లకు దక్కించుకున్న వేదశ్రీ బాణాల హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : దేశవ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా దేశ విదేశాల్లో కూడా ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా లండన్‌లో వినాయక చవితి ఉత్సవాలు ప్రవాస భారతీయులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నరేష్ మెడిచేట్టి ఆధ్వర్యంలో 200 మంది సభ్యులతో ఘనంగా పూజలు జరిపారు.ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ మనం ఎక్కడ ఉన్నా మన సంప్రదాయాలను పాటించాలన్నారు. కుల మతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలన్నారు. లడ్డూ వేలం పాటలో 3 లక్షల 60,000 లకు సికింద్రాబాద్ వారాసిగూడకి చెందిన వేదశ్రీ బాణాల దక్కించుకున్నారు.5 గ్రాముల గోల్డ్ లక్కీ డ్రాలో అఖిల్ బండి సంపాదించుకున్నారు.ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా సౌతాల్ మాజీ ఎంపీ.వీరేందర్ శర్మ, యూరప్ మహిళా అధ్యక్షురాలు,యూత్.సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గురుమిందర్,కుమిలి ప్రెసిడెంట్ జాన్సన్ ఎడ్మన్ లు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో బండి అఖిల్, చరణ్, కార్తిక్, అన్విత్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ డైవర్షన్

* **కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ ప్రకటన**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చంద్రుగొండ మండలంలో గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టనున్నట్లు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ తెలిపారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేకంగా ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేయనున్నట్టు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**డైవర్షన్ మార్గాలు ఇలా ఉంటాయి**

వియం బంజర నుండి కొత్తగూడెం వైపు వచ్చే వాహనాలు కల్లూరు, తల్లాడ, ఏన్కూరు , జూలూరుపాడు మీదుగా కొత్తగూడెం చేరుకోవాలి.కొత్తగూడెం నుండి వియం బంజర వైపు వెళ్లే వాహనాలు జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు మీదుగా ప్రయాణించాలి. ఈ ట్రాఫిక్ డైవర్షన్ మూడవ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటుందని డిఎస్పీ తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాహనదారుల ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు చేపట్టిన ఈ మార్గదర్శకాలను గమనించి ప్రజలు సహకరించాలని రెహమాన్ కోరారు.

## ఆలయంలో అద్భుతం.. అమ్మవారి కంట్లో నుంచి నీరు



కామారెడ్డిలోని పరంజ్యోతి భగవతి భగవాన్ ఆలయంలో అద్భుతం జరిగింది. సాక్షాత్తు అమ్మవారి కంట్లో నుంచి కన్నీరు వచ్చినట్లు భక్తులు చెబుతున్నారు. సోమవారం ఈ వింత ఘటన చోటు చేసుకుంది. అంతేకాదు.. అప్పటివరకు కామారెడ్డిలో కురుస్తున్న వర్షం ఒక్కసారిగా నిలిచిపోయిందని, కామారెడ్డిని అమ్మవారు కాపాడారని భక్తులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు చాలా అరుదుగా జరుగుతాయని భక్తులు చెబుతున్నారు. కొన్ని నెలల క్రితం ఇలాంటి ఘటనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానంది ఆలయంలో జరిగింది. ఆవు రూపంలో ఉన్న మహా పరమేశ్వరుడి ఆలయంలో నాగుపాము ప్రత్యక్షమైంది. ఎప్పుడు శివుడి మెడలో కనిపించే నాగుపాము ఆలయంలో ప్రత్యక్షం కావడంతో భక్తులు సాక్ష్యాత్తూ పరమేశ్వరుడే అంటూ మొక్కారు. ఇది జరిగిన నెలలకు కామారెడ్డిలోని అమ్మవారి కంట్లో నీరు కావడం చర్చనీయాంశం అయింది.

# కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు

* **చౌటుప్పల్ లో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ**
* **మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను బధనాం చేయడం కోసం కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. కాలేశ్వరం కమిషన్, ఘోష్ కమిటీ విచారణ రిపోర్టు పేరుతో అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం రాద్ధాంతం చేయడం, కేసును సిబిఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ సోమవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం జాతీయ రహదారిపై బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్ స్టేషన్ కు ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించారు. జాతీయ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది.దీంతో చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని, బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులను బలవంతంగా తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీలో మంత్రుల దాడిని మాజీ మంత్రి హరీష్ రావు అభిమాన్యుని వలె ఎదుర్కొన్నాడన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా కెసిఆర్ ను కానీ, బీఆర్ఎస్ ను కానీ ఏమీ చేయలేరన్నారు. బిఆర్ఎస్ ఏ కార్యక్రమం తలపెట్టిన కాంగ్రెస్ అడ్డుకోవాలని చూస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికొదిలేసి, కేవలం కాళేశ్వరం కమీషన్ల పేరిట కేసీఆర్ ను ఇబ్బంది పెట్టడానికి రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారన్నారు. అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ పీసీ ఘోష్ కమీషన్ ఇచ్చిన 600పేజీల నివేదికను కేవలం 60పేజీలుగా మార్చి, కేసీఆర్ పై తప్పుడు ఆరోపణలు మోపడం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం మానేసి, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రతీకారానికి పరిమితమైపోయిందని ఆరోపించారు. రైతులు ఎరువుల కోసం, యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, గోదావరి జలాలను రైతులకు అందిస్తామని ఒకపక్క చెప్తూనే మరో ప్రక్క కాళేశ్వరం మూడు పిల్లర్లు కృంగినంత మాత్రాన రిపేరు చేయించకుండా పూర్తిగా కాళేశ్వరం ప్రాజెక్టునే పనికిరాదని చెప్తున్నారని, ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మరోసారి ప్రజలను మభ్య పెట్టడం కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు విషయాన్ని ముందుకు తీసుకు వచ్చిందని తీవ్రంగా విమర్శించారు. రైతులకు అందిస్తామని మరోపక్క కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పుడు ఆరోపణలతో కేసీఆర్ ను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని, పీసీ ఘోష్ నివేదికను తారుమారు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ నిజాన్ని దాచిపెట్టాలని చూస్తోందన్నారు. తెలంగాణ ప్రజలతో కలిసి ఈ అన్యాయానికి వ్యతిరేకంగా చేపట్టిన మా పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ విజయడంకా మోగిస్తుందని, కాంగ్రెస్ కు పరాభవం తప్పదన్నారు. ఈ కార్యక్రమాలలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు తొర్పునూరి నరసింహ గౌడ్, నాయకులు బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, చౌట వేణుగోపాల్, కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, ఊడుగు మల్లేశం, కర్నాటి వెంకటేశం, సుర్వి యాదయ్య గౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, ఆల్మాస్పేట కిష్టయ్య, ఆందోజు శంకరాచారి, సుర్కంటి శంకర్ రెడ్డి, నల్లరాజు రమేష్, కొయ్యడ శేఖర్, ఆరుట్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### సెన్సెక్స్ 600 పాయింట్లు జంప్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. అన్నిరంగాల్లో కొనుగోళ్లు కనిపించడంతో మార్కెట్లు పుంజుకున్నాయి. నిఫ్టీ ఆటో ఇండెక్స్ 2.7శాతం పెరగడంతో మార్కెట్‌కు దన్నుగా నిలిచింది. క్రితం సెషన్‌తో పోలిస్తే బెంచ్ సెన్సెక్స్ 79,828.99 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 79,818.38 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 80,406.84 పాయింట్లకు చేరింది. చివరకు 554.84 పాయింట్ల లాభంతో 80,364.49 వద్ద ముగిసింది.

నిఫ్టీ 198.20 పాయింట్లు పెరిగి 24,625.05 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,681 షేర్లు లాభపడగా.. 1,320 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో బజాజ్ ఆటో, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, హీరో మోటార్స్, ఐచర్ మోటార్స్ లాభపడగా.. సన్ ఫార్మా, ఐటీసీ, హెచ్‌యూఎల్, టైటాన్ కంపెనీ, రిలయన్స్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో 2.7శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆ తర్వాత కన్స్యూమర్ డ్యూరబుల్స్ 2.2 శాతం పెరిగాయి. మిడ్ క్యాప్ 2 శాతం, స్మాల్-క్యాప్ సూచీ 1.7 శాతం పెరిగాయి. ఐటీ, మెటల్, ఎనర్జీ, ఆయిల్, గ్యాస్ సూచీలు ఒక్కొక్కటి 1.3శాతం నుంచి 1.6 శాతానికి పైగా పెరిగాయి. బ్యాంకులు, ఫైనాన్షియల్ సూచీలు మోస్తరు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు ఎఫ్‌ఎంసీజీ ఫ్లాట్‌గా ముగిసింది. ఫార్మా, మీడియా స్వల్పంగా పతనమైంది.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి బంగారం, వెండి ధరలు..!

### తులం ఏకంగా రూ.1.5లక్షలు..!



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు, వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్‌లో రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. ఎంసీఎక్స్‌లో బంగారం ధర పాత రికార్డులన్నీ బద్దలు కొడుతూ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. సెప్టెంబర్ ఒకటిన పసిడి, వెండి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం.. సోమవారం బంగారం రూ.2,404 పెరిగి తులం ధర రూ.1,04,792కి చేరుకుంది. మరోవైపు, వెండి ధర రూ.5,678 పెరిగి కిలోకు రూ.1,23,250కి పెరిగింది. సోమవారం బంగారం, వెండి ధరలు పెరగడానికి కారణం యూఎస్ డాలర్ బలహీనపడడం, సెప్టెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గించే అంచనాలు, ట్రంప్ సుంకాలకు సంబంధించిన అనిశ్చితి నేపథ్యంలో బంగారం ధరలు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. యూఎస్ సుంకాల కారణంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారానికి దన్నుగా నిలుస్తున్నాయని.. ఈ క్రమంలో డిమాండ్ పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ క్రమంలో ఈ ఏడాది బంగారం తులానికి రూ.1.08లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో వెండి ధర కూడా కిలోకు రూ.1.30లక్షలు చేరుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది అంటే జనవరి ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 24 క్యారెట్ల బంగారం ధర రూ.76,162 నుంచి రూ.1,04,792కి పెరిగింది. ఈ సమయంలో మొత్తం బంగారం ధర రూ.28,360 వరకు పెరిగింది. అదే సమయంలో వెండి కిలోకు రూ.86,017 నుంచి రూ.1,23,250కి చేరుకుంది. ఏకంగా రూ.37,233 ధర పెరిగింది. గతేడాది బంగారం రూ.12,810 పెరగడం విశేషం. ప్రస్తుతం ఢిల్లీలో 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.1,06,030 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.97,200 గా ఉన్నది. ఇక ముంబయి నగరంలో 24 క్యారెట్ల పుత్తడి రూ.1,05,880 ఉండగా.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.97,050 వద్ద ట్రేడవుతుంది. కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,05,880 ఉండగా.. 22 క్యారెట్ల పసిడి ధర రూ.97,050 వద్ద కొనసాగుతుంది.

వాస్తవానికి గతవారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఫెడరల్ అప్పీల్స్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ట్రంప్ వాణిజ్య భాగస్వామ్య దేశాలపై విధించిన సుంకాలను కోర్టు తప్పుపట్టింది. ట్రంప్ అధ్యక్ష అధికారులను దుర్వినియోగం చేశారని కోర్టు పేర్కొంది. అయితే, సుప్రీంకోర్టులో అప్పీల్ చేసేందుకు కోర్టు అక్టోబర్ 14 వరకు అవకాశం ఇచ్చింది. ఆ క్రమంలో డాలర్ బలహీనపడింది. పెట్టుబడిదారులు బంగారం కొనుగోళ్లపై ఆసక్తి చూపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల ప్రణాళిక, వాణిజ్య యుద్ధం భయం కారణంగా పెట్టుబడిదారులు బంగారం సురక్షితంగా ఉంటుందని భావించి కొనుగోలు చేస్తున్నారని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి పతనం కూడా బంగారం పెరగడానికి కూడా మారడానికి ప్రధాన కారణం. మరో వైపు చైనా, రష్యా వంటి దేశాలు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. ఈ కారణంగా మార్కెట్లో బంగారం డిమాండ్ పెరిగింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగియకపోవడంతో అస్థిరత కారణంగా పెద్ద ఎత్తున బంగారంపై పెట్టుబడులు పెడుతున్నారు.

## చిన్న స్వీట్ షాప్‌కు రూ.141 కోట్ల ట్యాక్స్ నోటీస్..

### షాప్ ఓనర్ షాక్..!




**లక్నో:** చిన్న స్వీట్ షాప్ నిర్వహిస్తున్న ఓ చిరువ్యాపారికి ఏకంగా రూ.141 కోట్ల పన్ను నోటీస్ జారీ అయ్యింది. దాంతో ఆ షాప్ ఓనర్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటన ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. యూపీలోని బులంద్‌షహర్ ప్రాంతంలో ఓ చిన్న స్వీట్ దుకాణం నడుపుతున్న సుధీర్ అనే వ్యక్తికి రూ.141 కోట్లకు పైగా అమ్మకాలపై ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు.

వెంటనే పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీసి ఫిర్యాదు చేశాడు. తనకు సంబంధంలేని కంపెనీ అమ్మకాలపై 2022లో కూడా సీజీఎస్టీ కార్యాలయం నుంచి పన్ను నోటీస్ అందిందని, ఆ కంపెనీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అప్పుడే పన్ను విభాగ అధికారులకు వివరించానని తెలిపాడు. మళ్లీ జూలై 10న తాను రూ.141 కోట్ల అమ్మకాలు చేసినట్లు మరో నోటీస్ వచ్చిందన్నాడు. ఆ నోటీస్‌లో తన పేరు, చిరునామా, పాన్ నంబర్ ఉండటమే కాకుండా.. తాను ఢిల్లీలో ఆరు కంపెనీలను నడుపుతున్నట్లు ఉందని చెప్పాడు.

అయితే దీనిపై బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొందరు ఆర్థిక, సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరవడానికి, షెల్ కంపెనీలను సృష్టించడానికి, రుణాలు పొందడానికి లేదా పన్నులు ఎగవేసేందుకు ఎవరైనా మరొక వ్యక్తి పాన్ వివరాలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తుంటారని అధికారులు వెల్లడించారు. ఇటువంటి మోసాలు పన్ను నోటీసులు వచ్చినప్పుడో లేదంటే రికవరీ కాల్స్ వచ్చినప్పుడో బయటపడుతుందని చెప్పారు.

కాబట్టి ప్రజలు తమ పాన్‌కార్డు వివరాలను బయటి వ్యక్తులతో పంచుకోవద్దని, తమ క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకుంటూ ఉండాలని సూచించారు. పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేయడం వల్ల ఇలాంటి మోసాలను చాలావరకు అరికట్టవచ్చని సూచించారు. ఇదిలావుంటే ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ పారిశుద్ధ్య కార్మికుడికి కూడా రూ.34 కోట్ల అమ్మకాలపై పన్ను చెల్లించాలని నోటీసులు అందాయి. దాంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వుమెన్స్ వరల్డ్ కప్-2025 విజేతకు భారీగా ప్రైజ్‌మని

# ప్రకటించిన ఐసీసీ..!

**న్యూఢిల్లీ:** త్వరలో ప్రారంభం కానున్న ఐసీసీ వుమెన్స్ వన్డే వరల్డ్ కప్-2025 విజేతకు భారీ ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. ఈసారి చాంపియన్‌గా నిలిచే జట్టుకు ఏకంగా 4.48 మిలియన్ డాలర్లు (సుమారు రూ.39.55కోట్లు) ఇవ్వనున్నట్లు వెల్లడించింది. గత ఎడిషన్‌లో ప్రైజ్‌మనీ 1.32 మిలియన్ డాలర్లు (రూ.11.65కోట్లు) ప్రైజ్‌మనీ కంటే దాదాపు నాలుగు రెట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఈ 13వ ఎడిషన్‌లో మొత్తం ఎనిమిది జట్లు బరిలోకి దిగనున్నాయి.






### మెన్స్ టీమ్ కంటే ఎక్కువగా..

ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 13.88 మిలియన్ యూఎస్ డాలర్ల (సుమారు రూ.122.5కోట్లు). ఇది 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన చివరి ప్రపంచ కప్ (3.5 మిలియన్ డాలర్లు అంటే రూ. 31 కోట్లు) కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ఈ ప్రైజ్‌మనీ 2023 మెన్స్ ప్రపంచ కప్ (10 మిలియన్ డాలర్లు అంటే రూ. 88.26 కోట్లు) కంటే కూడా ఎక్కువ కావడం విశేషం. 2023లో మెన్స్ వన్డే ప్రపంచ కప్ విజేత జట్టు ఆస్ట్రేలియాకు రూ.33.31 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోగా.. రన్నరప్‌గా నిలిచిన భారత్‌కు రూ.16.65 కోట్లు దక్కాయి. మహిళల వన్డే ప్రపంచ కప్ విజేత మొత్తం దీని కంటే చాలా ఎక్కువ. అయితే, ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ పెంచడం వెనుక ప్రధాన ఉద్దేశం వుమెన్స్ క్రికెట్‌కు సైతం ప్రజాదరణ కల్పించడంతో పాటు పరుషులతో పాటు సమానంగా గౌరవం ఇవ్వడమే.

### ఎవరికి ఎంత ప్రైజ్‌మనీ..

ఈ సారి వుమెన్స్ వరల్డ్ కప్‌లో విజేత జట్టుకు 4.48 మిలియన్ డాలర్లు (రూ.39.55 కోట్లు) ఇవ్వనుండగా.. రన్నరప్‌గా నిలిచే జట్టుకు 2.24 మిలియన్ డాలర్లు (రూ.19.77 కోట్లు) ఇవ్వనుంది. ఇక సెమీఫైనల్‌లో ఓడిన పోయిన జట్లకు ఒక్కొక్కరికి 1.12 మిలియన్ డాలర్లు (రూ.9.89 కోట్లు) ఇస్తారు. గ్రూప్ దశలో గెలిచిన జట్లకు ఒక్కో మ్యాచ్‌కు 34,314 డాలర్లు (రూ.30.29 లక్షలు).. ఐదు, 6వ స్థానాల్లో నిలిచే జట్లకు రూ.62లక్షల వరకు.. 7వ, 8వ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 24.71లక్షలు.. టోర్నీలో పాల్గొనే అన్ని జట్లకు రూ. 22లక్షలు ఐసీసీ ఇవ్వనుంది. ఈ ఏడాది ఐసీసీ వుమెన్స్ వన్డే వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక




సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నారు. భారత్‌లోని గౌహతి, ఇండోర్, నవీ ముంబయి, విశాఖపట్నం, శ్రీలంక కొలంబోలోని ఐదు వేదికల్లో జరుగుతాయి.

### చారిత్రాత్మకమన్న జై షా..

ఐసీసీ అధ్యక్షుడు జై షా ప్రైజ్‌మనీ పెంచడాన్ని మహిళల క్రికెట్ దిశగా ఓ చారిత్రాత్మక ముందడుగుగా అభివర్ణించారు. ఈ ప్రకటన మహిళల క్రికెట్ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని.. ప్రైజ్‌మనీ నాలుగు రెట్లు పెరుగడంతో క్రీడ దీర్ఘకాలిక వృద్ధికి తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. మహిళా క్రికెటర్లు క్రికెట్‌ను వృత్తిగా కొనసాగించిన సమయంలో.. పురుషులతో సమాన గౌరవం, అవకాశాలు లభిస్తాయని నమ్మకంగా ఉండాలని ఐసీసీ సందేశం ఇస్తుందని స్పష్టం చేస్తుందన్నారు. ఈ మార్పు రాబోయే తరం మహిళా క్రీడాకారులు, అభిమానులకు స్ఫూర్తినిస్తుందని.. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెట్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళుతుందని ఐసీసీ పేర్కొంది.

## కేంద్రమంత్రి కుమారుడికి

# క్రికెట్ బోర్డు పగ్గాలు..

### పిన్నవయస్కుడిగా రికార్డు..?

**న్యూఢిల్లీ:** రాజకీయ నాయకుల వారసులు క్రికెట్‌లో పెత్తనం చెలాయించడం చూస్తున్నాం. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కుమారుడు జై షా బీసీసీఐ కార్యదర్శి నుంచి ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్ మండలి ఛైర్మన్ కుర్చీపై కూర్చోబోతున్నాడు. రాష్ట్రస్థాయి బోర్డుల్లోనూ పలువురు రాజకీయ పెద్దల కుమారులు అధ్యక్ష స్థానంలో ఉన్నారు. తాజాగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కుమారుడు మహనార్యమణ్ సింధియా మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. గత పదేళ్లుగా వీళ్ల కుటుంబ సభ్యులే ఎంపీ క్రికెట్‌ను శాసిస్తున్నారు. ఇప్పుడు మూడోతరం ప్రతినిధిగా మహనార్యమణ్ బాధ్యతలు చేపట్టనున్నాడు.

మధ్యప్రదేశ్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా మహనార్యమణ్‌ను సోమవారం సభ్యులు ఎన్నుకున్నారు. ఎంపీసీఏ బాస్‌గా 29 ఏళ్ల సింధియా ఏకగ్రీవంగా ఎంపికైనట్టు చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రోహిత్ పండిట్ వెల్లడించాడు. దాంతో.. అత్యంత చిన్నవయసులోనే బోర్డు పగ్గాలు చేపట్టిన సింధియా సరికొత్త చరిత్ర లిఖించాడు.

68 ఏళ్ల ఆ రాష్ట్ర క్రికెట్ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని రికార్డును మహనార్యమణ్ సొంతం



చేసుకున్నాడు. గత మూడేళ్లుగా మహనార్యమణ్ మధ్యప్రదేశ్ క్రికెట్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. 2022లో అడు జీడీసీఏ ఉపాధ్యక్షుడిగా.. ఎంపీసీఏ జీవితకాల సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఇంతకుముందు వీళ్ల తాత మధ్వవ్‌రావు సింధియా .. ఆ తర్వాత జ్యోతిరాదిత్య సింధియా ఎంపీసీఏ అధ్యక్షులుగా సేవలందించారు.

# ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నం

### హ్యాట్రిక్ ట్రోఫీలతో సరికొత్త చరిత్ర..!

**న్యూఢిల్లీ:** పొట్టి క్రికెట్‌లో సంచలన విజయాలు మామూలే. కానీ, ఒకేఒక జట్టు వరుసపెట్టి టైటిళ్లు గెలవడం మాత్రం దాదాపు అసాధ్యమే. అయితే.. ఒక జట్టు మాత్రం నభూతో నభవిష్యత్ అనేలా.. కొన్ని తరాలు నిలిచిపోయే ప్రదర్శనతో ఔరా అనిపించింది. 'ది హండ్రెడ్ లీగ్'లో తమ ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా మూడో ఏడాటి టైటిల్ కొల్లగొట్టింది. ప్రత్యర్థుల పాలిటి సింహస్వప్నంలా నిలుస్తూ హ్యాట్రిక్ ట్రోఫీతో చెక్కుచెదరని రికార్డు నెలకొల్పింది ఓవల్ ఇన్విన్సిబుల్స్. వన్డే వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా మాదిరిగా ఈ వంద బంతుల టోర్నీలో అజేయ శక్తిగా ఎదిగిన ఓవల్ జట్టు విజయ ప్రస్థానమిది.

ఐపీఎల్ స్ఫూర్తిగా ఇంగ్లండ్ గడ్డపై 'ది హండ్రెడ్ లీగ్' ఏమంట మొదలైందోగానీ.. ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టు టైటిళ్ల వేటతో దడపుట్టిస్తోంది. 2023 ఆరంభ సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ఓవల్.. నిరుడు కూడా దుమ్మురేపి ట్రోఫీని తన్నుకుపోయింది. ఈ ఏడాది కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగి హ్యాట్రిక్ టైటిల్‌తో నవ చరిత్రకు నాంది పలికింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ట్రెంట్ రాకెట్స్‌కు సామ్ బిల్లింగ్స్ నేతృత్వంలోని ఓవల్ టీమ్ చెక్ పెట్టింది. దాంతో తొలిసారి విజేతగా నిలవాలనుకున్న రాకెట్ జట్టు కల కలగానే మిగిలిపోయింది.

మొదట విల్ జాక్స్(72) విధ్వంసంతో 5



వికెట్ల నష్టానికి 168 రన్స్ చేసింది. దాంతో, రాకెట్స్ బ్యాటర్లు లక్ష్యాన్ని తేలికగా ఛేదిస్తారని.. ఈసారి ఓవల్ ఇన్విసిబుల్స్ రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సిందే అని అనుకున్నారంతా. కానీ బౌలింగ్‌లో నాథన్ సోవ్టర్ (3-250)తో ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. దాంతో, రాకెట్స్ టీమ్‌ను 26 పరుగుల తేడాతో మట్టికరిపించిన ఓవల్ జట్టు ముచ్చటగా మూడోసారి ఛాంపియన్‌గా మురిసిపోయింది.

### రెండో జట్టుగా రికార్డు..

పొట్టి క్రికెట్‌లో వరుసగా మూడు టైటిళ్లు గెలుపొందిన రెండో జట్టుగా ఓవల్ ఇన్విసిబుల్స్ అవతరించింది. ఈ జట్టు కంటే ముందు కరేబియన్ టీ20 కప్‌లో ట్రినిడాడ్ టొబాగో ఇలానే హ్యాట్రిక్ టైటిళ్లతో రికార్డు నెలకొల్పింది. దినేశ్ రామ్‌దిన్ నేతృత్వంలోని ట్రినిడాడ్ 2011, 2012, 2013లో ఛాంపియన్‌గా నిలిచింది.

# ఒలింపిక్స్ పతకమే టార్గెట్..

### రైజింగ్ షూటర్ తనిష్క్

**హైదరాబాద్:** తెలంగాణ యువ షూటర్ తనిష్క్ మురళీధర్ నాయుడు టాప్ షూటర్‌గా ఎదుగుతున్నాడు. ఈ హైదరాబాదీ క్రీడాకారుడు తాజాగా ముగిసిన ఆసియా జూనియర్స్ షూటంగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు సాధించాడు. ఒలింపిక్స్‌లో పతకమే టార్గెట్‌గా తనిష్క్ తన ట్యాలెంట్‌కు పదును పెడుతున్నాడు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన ఆసియా షూటింగ్ పోటీల్లో అతను 25 మీటర్ల స్టాండర్డ్ పిస్తోల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించాడు. గత రెండేళ్ల నుంచి టాప్ ఫామ్‌లో ఉన్న ఆ షూటర్ ఇప్పుడు ఒలింపిక్స్‌ను టార్గెట్‌గా పెట్టుకున్నాడు. ప్రస్తుతం జూనియర్ స్థాయిలో ఆడుతున్న అతను.. త్వరలోనే సీనియర్స్ కేటగిరీలోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు.

హైదరాబాద్‌లో ఉన్న ఒలింపిక్ షూటర్ గగన్‌నారంగ్ అకాడమీలో తనిష్క్ శిక్షణ పొందుతున్నాడు. గన్ ఫర్ గ్లోరీ అకాడమీ నుంచి తనిష్క్ రాటుదేలుతున్నాడు. ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే కాదు.. ఆ మెగా ఈవెంట్‌లో దేశానికి పతకాన్ని తీసుకురావాలన్న కాంక్షతో ట్రైనింగ్ తీసుకుంటున్నట్లు తనిష్క్ చెప్పాడు. నమస్తే తెలంగాణతో మాట్లాడిన తనిష్క్.. ఇటీవల ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్ ఫలితంపై సంతోషం వ్యక్తం చేశాడు. తన ప్లానింగ్, ప్రిపరేషన్ గురించి అతను వెల్లడించాడు. చాలా నిలకడగా, ఫోకస్డ్‌గా షూటింగ్ ప్రాక్టీస్ కొనసాగిస్తున్నట్లు తనిష్క్ తెలిపాడు.

ఖేలో ఇండియా, ప్రాజెక్టు లీప్ ప్రస్తుతం స్పాన్సర్‌షిప్



కల్పిస్తున్నాయన్నాడు. మునుముందు మరింత ప్రోత్సాహం లభిస్తే, షూటింగ్ ఫీల్డ్‌లో మరిన్ని పతకాలు గెలవడం ఖాయమని తనిష్క్ చెప్పాడు. తనిష్క్ తండ్రి శ్రీనివాస్ రావు. ఆయన భారతీయ నౌకాదళంలో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న రక్షణశాఖకు చెందిన డిజైన్ ఇంజినీర్ శాఖలో పనిచేస్తున్నారు. షూటర్ తనిష్క్ తల్లి అనురాధ. ఆమె ఇంటిపని చూసుకుంటూ.. కుమారుడిని తీర్చిదిద్దుతున్నారు. తనిష్క్‌కు అన్నిరకాలుగా ఆమె మనోధైర్యాన్ని ఇస్తున్నారు.



# సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న బాలీవుడ్ బ్యూటీ..

## బట్టబయలు చేసిన ఫరా ఖాన్

బయటపడ్డ బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ పెళ్లి రహస్యం

వ్యాపారవేత్త టోనీ బేగ్‌తో ఆరు నెలల క్రితమే వివాహం

అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన పెళ్లి వేడుక

టాకీస్: బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ వైవాహిక జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన రహస్యం అనూహ్యంగా బయటపడింది. ముంబైలో జరిగిన నీతా ముకేశ్ అంబానీ కల్చరల్ సెంటర్ ఈవెంట్‌లో ప్రముఖ దర్శకురాలు ఫరా ఖాన్ అన్న ఒక్క మాటతో నర్గీస్ పెళ్లి విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్నాళ్లుగా ఆమె తన వివాహాన్ని అత్యంత గోప్యంగా ఉంచడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల జరిగిన ఈవెంట్‌లో నర్గీస్ ఫక్రీ, ఫరా ఖాన్ కలిసి రెడ్ కార్పెట్‌పై ఫోటోలకు పోజులిచ్చారు. అదే సమయంలో అక్కడే ఉన్న టోనీ బేగ్‌ను ఉద్దేశించి ఫరా ఖాన్, "టోనీ.. వచ్చి నీ భార్య పక్కన నిలబడు" అని పిలిచారు. ఈ ఒక్క పిలుపుతో నర్గీస్, టోనీ భార్యాభర్తలనే నిజం అందరికీ తెలిసిపోయింది. దీంతో అక్కడున్న వారితో పాటు, ఈ వీడియో చూసిన నెటిజన్లు కూడా ఆశ్చర్యపోయారు. అందిన సమాచారం ప్రకారం, నర్గీస్ ఫక్రీ, అమెరికాకు చెందిన వ్యాపారవేత్త టోనీ బేగ్‌ల వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జరిగింది. కాలిఫోర్నియాలో వీరి పెళ్లి జరిగినట్టు తెలుస్తోంది. వివాహం అనంతరం ఈ జంట స్విట్జర్లాండ్‌లో హనీమూన్ జరుపుకున్నట్లు సమాచారం. అంటే, వీరి పెళ్లయి ఇప్పటికే ఆరు నెలలు దాటిపోయింది. సోషల్ మీడియాలో నిత్యం చురుగ్గా ఉండే నర్గీస్, తన జీవితంలోని ఇంత ముఖ్యమైన విషయాన్ని ఇన్నాళ్లుగా రహస్యంగా ఉంచడంపై పలువురు చర్చించు కుంటున్నారు.'రాక్‌స్టార్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన నర్గీస్ ఫక్రీ, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల 'హౌస్‌ఫుల్-5'తో ఆమె మరో విజయాన్ని అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె సుపరిచితురాలే. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' చిత్రంలో ఆమె ఒక ముఖ్య పాత్రలో నటించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం సానుకూల స్పందనను దక్కించుకుంది. ఇప్పుడు ఆమె రహస్య వివాహం వార్తతో మరోసారి వార్తల్లో నిలిచారు.

## పవన్ కళ్యాణ్‌ను నేను ఇలా చూడాలనుకున్నాను: హరీశ్ శంకర్

నేడు పవన్ కల్యాణ్ పుట్టినరోజు

శుభాకాంక్షలు తెలిపిన దర్శకుడు హరీశ్ శంకర్

సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టిన డైరెక్టర్

నా సోదరుడు, స్ఫూర్తి, హీరో అంటూ పవన్‌పై ప్రశంసలు

'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా నుంచి సరికొత్త పోస్టర్ విడుదల




టాకీస్: 'పవర్ స్టార్' పవన్ కల్యాణ్ పుట్టినరోజు (సెప్టెంబరు 2) సందర్భంగా అభిమానులకు అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' నుంచి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ ప్రత్యేక పోస్టర్‌తో పాటు తన అభిమాన హీరోకు సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పవన్ కల్యాణ్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ హరీశ్ శంకర్ ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు.. నా సోదరుడు, నా స్ఫూర్తి, నా హీరో.. ఒకే ఒక్క పవర్ స్టార్ పవన్ కల్యాణ్" అంటూ ట్వీట్ చేశారు. దీనికి జతగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌కు, "ఆయన్ను నేను ఇలా చూడాలనుకుంటున్నాను.. మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అని క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తాజా పోస్టర్‌లో పవన్ కల్యాణ్ లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉండటంతో అభిమానులు పండగ చేసుకుంటున్నారు. పుట్టినరోజున అభిమాన హీరో సినిమా నుంచి వచ్చిన ఈ అప్‌డేట్‌తో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

## తన తల్లి శ్రీదేవి సూపర్ హిట్ సినిమా రీమేక్‌లో జాన్వీ కపూర్

శ్రీదేవి క్లాసిక్ హిట్ 'చాల్‌బాజ్' రీమేక్‌లో జాన్వీ కపూర్

తల్లి పోషించిన ద్విపాత్రాభినయంలో నటించేందుకు ఆసక్తి

పాత్ర కోసం గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టిన జాన్వీ

టాకీస్: అతిలోక సుందరి శ్రీదేవి కెరీర్‌లోని మరపురాని చిత్రాల్లో 'చాల్‌బాజ్' ఒకటి. 1989లో వచ్చిన ఈ సినిమాలో ఆమె ద్విపాత్రాభినయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇదే క్లాసిక్ సినిమా రీమేక్‌లో శ్రీదేవి కుమార్తె, యువ కథానాయిక జాన్వీ కపూర్ నటించనున్నారనే వార్త బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. తన తల్లి పోషించిన ఐకానిక్ పాత్రను పోషించేందుకు జాన్వీ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తన తల్లి శ్రీదేవి నటించిన చిత్రాలంటే తనకు ఎంతో ఇష్టమని, అవి తనకో ఎమోషన్ అని జాన్వీ పలు సందర్భాల్లో చెప్పారు. ఈ క్రమంలో, ఆమెకు బాగా నచ్చిన సినిమాల్లో ఒకటైన 'చాల్‌బాజ్' రీమేక్‌లో నటించే అవకాశాన్ని ఒక సవాలుగా తీసుకున్నారని బాలీవుడ్ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పాత్ర కోసం జాన్వీ ఇప్పటికే ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ కూడా మొదలుపెట్టారని సమాచారం. ఓ ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారని, దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఈ సెప్టెంబర్ నెలాఖరులో వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

గతంలో కూడా 'చాల్‌బాజ్' చిత్రాన్ని 'చాల్‌బాజ్ ఇన్ లండన్' పేరుతో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. శ్రద్ధా కపూర్‌ను ప్రధాన పాత్రధారిగా ప్రకటిస్తూ పోస్టర్లు కూడా విడుదల చేశారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. ఇప్పుడు జాన్వీ పేరు తెరపైకి రావడంతో ఈ రీమేక్‌పై మళ్లీ ఆసక్తి పెరిగింది. ఒరిజినల్ సినిమాలో శ్రీదేవి రెండు విభిన్నమైన పాత్రల్లో అద్భుతంగా నటించారు. మరి రీమేక్‌లో జాన్వీ కూడా ద్విపాత్రాభినయం చేస్తారా? లేక కథలో ఏమైనా మార్పులు ఉంటాయా? అనేది వేచి చూడాలి. ప్రస్తుతం జాన్వీ కపూర్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'పరమ్ సుందరి' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఆమె, త్వరలో 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాతో అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానున్నారు. దీంతో పాటు తెలుగులో రామ్ చరణ్ సరసన 'పెద్ది' చిత్రంలో కూడా నటిస్తున్నారు.



## ఆలస్యంగా థియేటర్లలోకి కిష్కింధపురి



టాకీస్: ఈ ఏడాది భైరవం సినిమాతో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో ఆడియెన్స్‌ను పలుకరించాడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఈ యాక్టర్ నటిస్తోన్న ఫాంటసీ హారర్ థ్రిల్లర్ కిష్కింధపురి. కౌశిక్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్‌ను నెట్టింట హల్ చల్ చస్తోంది.

కాగా ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 12న విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ మూవీని ఒక రోజు ఆలస్యంగా అంటే సెప్టెంబర్ 13న విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది టీం. హార్రర్ కల్చర్‌లో మిస్టరీ, డేంజర్, ఫియర్ లాంటి అంశాలు తరచూ 13వ నంబర్‌తో లింక్ అయి ఉంటాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ తీసుకున్న స్ట్రాటజీ కిష్కింధపురి సినిమాకు కలిసొచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు.

హారర్ కల్చర్‌లో 13 కేవలం ఒక నంబర్ మాత్రమే కాదు.. ఇది ఒక మిస్టరీ, డేంజర్, గుర్తు తెలియని భయం. అందుకే కిష్కింధపురి ఆగమనానికి ఇదే తేదీన వస్తోంది.. అంటూ షేర్ చేసిన నయా లుక్ సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.

తేజ సజ్జా మిరాయి సినిమా సెప్టెంబర్ 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బెల్లంకొండ తీసుకున్న తాజా నిర్ణయంతో మిరాయి సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఫస్ట్ డే పోటీ ఉండకపోవడం కూడా సినిమాకు ప్లస్ అవుతుందంటున్నారు సినీ జనాలు. మంత్రాలతో మూసివేయబడిన ఒక పాత మహల్‌లోకి హీరో తన అనుచరులతో కలిసి వెళ్లిన అనంతరం ఆ మహల్‌లో ఏం జరిగిందనే నేపథ్యంలో సినిమా ఉండబోతుందని కిష్కింధపురి గ్లింప్స్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్ కౌశిక్.

## కల్కి-2కు రెండు మూడేళ్లు పట్టవచ్చు: నాగ్ అశ్విన్

టాకీస్: 'కల్కి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లను రాబట్టిన దర్శకుడు నాగ్ అశ్విన్. అయితే, ఇప్పుడు ఈ సినిమా సీక్వెల్‌కి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 2024 జూన్ నెలలో విడుదలైన 'కల్కి' లో ప్రభాస్ ప్రధాన పాత్రల్లో



నటించగా.. బాక్సాఫీస్ వద్ద దుమ్ము లేపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించి టాలీవుడ్ పవర్ ను విశ్వవ్యాప్తంగా మరోసారి చాటి చెప్పింది. ఈ భారీ విజయంతో సినిమా అభిమానులందరి దృష్టి ఇప్పుడు 'కల్కి 2' పై పడింది.తాజాగా ఓ పోడ్కాస్ట్‌లో పాల్గొన్న నాగ్ అశ్విన్ మాట్లాడుతూ.. 2025 చివర్లో 'కల్కి 2' షూటింగ్

ప్రారంభించాలని అనుకున్నట్లు- ఆయన అన్నారు. అయితే, ఇందులో చాలా అంశాలు కలసి రావాల్సి ఉంది. ముఖ్యంగా సినిమాలోని నటులందరి షెడ్యూల్స్ కుదరాలి. అలాగే ఇప్పటికే ప్రీ-విజువలైజ్ చేసిన యాక్షన్ సన్నివేశాలు చాలా పెద్దవి కాబట్టి మరింత సమయం పడుతుంది. ప్రస్తుతానికి ఖచ్చితమైన సమాధానం చెప్పలేను. ఆర్టిస్టులందరూ అందరూ బిజీగా ఉన్నారు అని అన్నాడు. అలాగే షూటింగ్ కంటే పోస్ట్ ప్రొడక్షన్ మరింత సమయం పడుతుందని ఆయన పేర్కొన్నారు. మరో 2 లేదా 3 సంవత్సరాల్లో సినిమా పూర్తవుతుందని అనుకుంటున్నానని భారీ బాంబ్ పేల్చాడు. అప్పటివరకు అభిమానులు ఓపిక పట్టాలి అంటూ నాగ్ అశ్విన్ స్పష్టం చేశారు. 'కల్కి 2898 ఆఢ 'లో ప్రభాస్, దీపికా పదుకోనతో పాటు- బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్, తమిళ సూపర్ స్టార్ కమల్ హాసన్ లు కీలక పాత్రల్లో కనిపించారు.

## మహిళల పవర్‌ను పురుషులే గుర్తిస్తారు



తమన్నా ఆసక్తికర వ్యాఖ్యలు

టాకీస్: సినీ ఇండస్ట్రీలో గ్లామర్ రోల్స్ నుంచి వైవిధ్యమైన పాత్రల వరకు తనదైన ముద్ర వేసుకున్న నటి తమన్నా భాటియా. ఇటీవల ఒక కార్యక్రమంలో ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. సాధారణంగా మహిళలు తమ శక్తిని తాము గుర్తించకపోవచ్చుని, కానీ జీవితంలో ఉన్న అద్భుతమైన పురుషుడు దాన్ని ప్రతిబింబంగా చూపిస్తారని ఆమె భావన వ్యక్తం చేసింది. తన జీవితంలో అలాంటి వ్యక్తులు ఉన్నారని ఆమె చెప్పిన తీరు, స్పష్టంగా నటుడు విజయ్ వర్మ గురించి అని అభిమానులు భావిస్తున్నారు. విజయ్ వర్మ తన జీవితంలోకి వచ్చాక తమన్నా నిజంగానే ఆత్మవిశ్వాసంతో, ఆనందంగా కనిపించింది. అయితే తర్వాత వారి కెరీర్ ప్రెజర్ కారణంగా విభేదాలు వచ్చి విడిపోయారనే వార్తలు వైరల్ అయ్యాయి. కానీ ఈ జంట ఒకరిపై ఒకరు నెగెటివ్‌గా మాట్లాడకుండా, పరస్పర గౌరవంతో సంబంధాన్ని ముగించుకోవడం అందరినీ ఆకట్టుకుంది. తమన్నా వ్యాఖ్యల్లో అర్థం చేసుకునే స్వభావం ఇప్పుడు మహిళలకు ఒక ప్రేరణ గా మారుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.